ఈనాడు
తిరుపతి
శుక్రవారం అక్టోబరు 11, 2024

చక్రస్నానానికి ఏర్పాట్ల పరిశీలన

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆఖరి ఘట్టమైన చక్రస్నానం ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరిలు అధికారులతో కలిసి తనిఖీ చేశారు. గురువారం శ్రీవారి పుష్కరిణి వద్దకు చేరుకున్న వారు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. గజ ఈతగాళ్లను, అగ్నిమాపక శాఖ సిబ్బంది, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది, శ్రీవారి సేవకులు సమన్వయం చేసుకుంటూ చక్రస్నానం సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, తితిదే సీవీఎస్వో శ్రీధర్, ఎస్పీలు ఎల్.సుబ్బరాయుడు, మురళీకృష్ణ, డీఎస్పీ విజయ్‌శేఖర్ తదితరులు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న తితిదే ఈవో శ్యామలరావు, చిత్రంలో అదనపు ఈవో వెంకయ్యచౌదరి తదితరులు

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా గురువారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 12 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. బుధవారం శ్రీవారిని 79,753 మంది దర్శించుకోగా రూ.3.48 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

ఆచంద్రార్కం.. శ్రీపతి దివ్యతేజం



తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఏడోరోజు గురువారం ఉదయం శ్రీమలయప్ప స్వామి సూర్యప్రభ వాహనంపై బద్రీనారాయణుడి అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఉదయం వాహన మండపం నుంచి మాడవీధిలోని శ్రీవారి ఆలయం వద్దకు చేరుకోగానే చిరుజల్లులు ప్రారంభం కావడంతో మాటాటోపం కింద స్వామిని ఊరేగించారు.

రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మలయప్పస్వామి చంద్రప్రభ వాహనంపై దర్బార్ కృష్ణుడి అలంకారంలో అభయప్రదానం చేశారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7.00 గంటలకు శ్రీవారి రథోత్సవం ప్రారంభమవుతుంది. రాత్రి అశ్వ వాహనంపై శ్రీమలయప్ప స్వామి ఊరేగనున్నారు.

ఎనిమిదేళ్లుగా తితిదేకు టీసీఎస్ సేవలు



శ్రీవారి సేవలు ఆన్‌లైన్ సంతరించుకోవడంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)ది కీలకపాత్ర. తితిదేకు ఉచిత సాఫ్ట్‌వేర్ సేవలను అందించే ఒప్పందం ఓ మైలురాయి. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో పూర్వపు ఈవో సాంబశివరావు హయాంలో ఇది సాకారమైంది. దీని ద్వారా తితిదేకు అవసరమైన సాఫ్ట్‌వేర్ సేవలను, ఉద్యోగులను టీసీఎస్ సమకూర్చింది. ఆన్‌లైన్, కరెంట్ బుకింగ్‌లో టికెట్ల జారీ, గదుల కేటాయింపు, నగదు స్వీకరణ, చెల్లింపు వంటి అనేక సాఫ్ట్‌వేర్ సేవలను ఎనిమిదేళ్లుగా తితిదేకు అందిస్తోంది. ఏడాదికి సుమారు రూ.12 కోట్ల విలువచేసే సేవలను టీసీఎస్ అందించడం గమనార్హం. 2018లో నిజపాద దర్శన సేవలో శ్రీవారిని రతన్‌టాటా దర్శించుకున్నారు. ఆయనతోపాటు టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తదితరులు వెంట ఉన్నారు.



ఆయన భక్త ఈయన సేవా
సులభుడు



◆ తితిదేకు టీసీఎస్.. తిరుపతికి స్వీకార్ తోడ్పాటు ◆ రతన్ టాటా దాతృత్వానికి ప్రతీక


రతన్ టాటాకు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న అప్పటి తితిదే జేఈవో శ్రీనివాసరాజు, చిత్రంలో టాటాగ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ (పాతచిత్రం)

నైతిక విలువలే పునాదులు.. నాణ్యతలో రాజీపడని ధోరణి.. దేశహితమే పరమావధి.. ప్రజల్లో అచంచల విశ్వాసం పాదుకొలిపి రూ.లక్షల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరిస్తూనే.. సేవా కార్యక్రమాలు భూరివిరాళాలతో తమ దాతృత్వాన్ని చాటుకున్నారు ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా(86). శ్రీవారి భక్తుడైన ఆయనకు తిరుమల, తిరుపతితో ప్రత్యేక అనుబంధం ఉంది. శ్రీవారి సేవలకు సాంకేతిక సొబగులు అద్దడంలో అండాదండా అందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తితిదేతో కలిసి అడుగులు వేశారు.

- ఈనాడు డిజిటల్, తిరుపతి; న్యూస్‌టుడే, తిరుపతి (వైద్యం), తిరుమల

పింక్ బస్సుతో ముందస్తు పరీక్షలు



క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నియంత్రించవచ్చని గుర్తించి పింక్ బస్సు సేవలను అందుబాటులోకి తెచ్చింది. నాలుగేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు వెళ్లి క్యాన్సర్ ముందస్తు పరీక్షలు చేస్తున్నారు. బాధితుల్లో 70 శాతం మంది ఆలస్యంగా క్యాన్సర్‌ను గుర్తిస్తుండగా కేవలం 30 శాతంమంది మాత్రమే ప్రాథమిక దశలో గుర్తిస్తున్నారు. దీంతో లెవల్ 1, 2, 3 స్టేజ్ క్యాన్సర్ సెంటర్ల ద్వారా చికిత్స అందిస్తున్నారు. పాఠశాలల నుంచి యూనివర్సిటీల వరకు క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

వైద్యసేవలు పొందిన రోగులు

ఏడాది	మొత్తం
2022	1500
2023	2400
2024 (సెప్టెంబరు వరకు)	2300


శ్రీసిటీ నమూనాను రతన్‌టాటాకు వివరిస్తున్న ఎండీ (పాతచిత్రం)

శ్రీసిటీతో అనుబంధం

శ్రీసిటీ(వరదయ్యపాళెం), న్యూస్‌టుడే: దేశంలో రెడీ-టు-ఈట్(ఆర్టీఈ) మార్కెట్‌లో రెండో అతిపెద్ద సంస్థగా పేరున్న టాటా స్మార్ట్ ఫుడ్ లిమిటెడ్(టీఎస్ఎఫ్ఎల్) పరిశ్రమ స్థాపించడానికి రతన్‌టాటా శ్రీసిటీని ఎంచుకున్నారు. శ్రీసిటీలోని క్రియా విశ్వవిద్యాలయం పాలక మండలికి సలహాదారుగానూ ఉన్నారు. 2019 ఏప్రిల్ 16న రతన్‌టాటా శ్రీసిటీ సందర్శనకు వచ్చారు. అంతర్జాతీయ, జాతీయ పరిశ్రమలు ఒకేచోట ఉన్న శ్రీసిటీ ప్రణాళిక, చిత్తశుద్ధిని రతన్‌టాటా అప్పట్లోనే అభినందించారు. శ్రీసిటీతో రతన్‌టాటాకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా డా.రవీంద్రసన్నారెడ్డి గుర్తుచేసుకున్నారు.


క్యాన్సర్ ఆస్పత్రికి భూమిపూజ చేస్తున్న చంద్రబాబు, రతన్‌టాటా

స్వీకార్‌కు శ్రీకారం

అత్యంత ప్రాణాంతకమైన క్యాన్సర్ నుంచి పేద ప్రజలను కాపాడేందుకు అధునాతన వైద్య సేవలను టాటా ట్రస్టు అందుబాటులోకి తెచ్చింది. శ్రీవారి పాదాల చెంత (తిరుపతి జూపార్కు రోడ్డులో) తితిదే 25 ఎకరాల స్థలం కేటాయించగా రూ.250 కోట్ల వ్యయంతో శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ (స్వీకార్)ను ఏర్పాటు చేసింది. దేశ ప్రజలను క్యాన్సర్ బారి నుంచి కాపాడాలని భావించిన టాటా ట్రస్టు దేశంలో ఐదుచోట్ల రూ.1800 కోట్ల వ్యయంతో క్యాన్సర్ ఆస్పత్రులకు శ్రీకారం చుట్టింది. విషయం తెలిసి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అవకాశం కల్పించాలని కోరడంతో తిరుపతిలో క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటుకు ముందుకొచ్చింది. నామమాత్రపు లీజుతో తితిదే విలువైన స్థలాన్ని టాటా ట్రస్టుకు కేటాయించింది. 2018 ఆగస్టు 31న స్వీకార్‌కు సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి రతన్ టాటా భూమిపూజ చేశారు.


తిరుపతిలోని టాటా క్యాన్సర్ ఆస్పత్రి

రాయలసీమకు వరంలా..

ప్రారంభంలో పది పడకలతో కీమోథెరపీ సేవలను అందుబాటులోకి తీసుకురాగా ప్రస్తుతం వంద పడకల ఆస్పత్రిగా సేవలందిస్తోంది. ఓపీల సంఖ్య 300కు చేరింది. నెలకు 1,100 వరకు కీమోలు, రోజూ 85 మందికి రేడియోథెరపీ, ప్రతినెలా సరాసరి 130 మేజర్ శస్త్రచికిత్సలు నిర్వహిస్తోంది. రాయలసీమ, నెల్లూరు జిల్లాల ప్రజలకు టాటా క్యాన్సర్ ఆస్పత్రి ఓ వరంగా నిలిచింది.

ఎలాగైనా పట్టేద్దాం!

☛ వాలిపోతున్న ఆశావహులు

☛ మద్యం దుకాణాలకు గడువు పెంపుతో పెరిగిన దరఖాస్తులు



● జిల్లాలోని 227 మద్యం దుకాణాలకు 10వ తేదీ సాయంత్రం 8 గంటల వరకు 2,589 దరఖాస్తులు దాఖలయ్యాయి. నగరపాలక పరిధిలోని 32 దుకాణాలకు.. 697 దరఖాస్తులు అందాయి.

తిరుపతి(నేరవిభాగం), గూడూరు, సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం మద్యం దుకాణాలకు దరఖాస్తుల గడువు పెంచడంతో ఆశావహుల సంఖ్య పెరిగింది. ఈ క్రమంలో పట్టణాల్లోని మద్యం దుకాణాల్లో పెత్తనం కోసం ఆరాటం ఎక్కువైంది. రేణిగుంటలో 10 దుకాణాలు, శ్రీకాళహస్తిలో 12, గూడూరు పట్టణంలో 12, నాయుడుపేట పట్టణంలో 13, సూళ్లూరుపేట పట్టణంలో 14 దుకాణాలు కేటాయించారు. వెంకటగిరిలో 9 దుకాణాలు కాగా గ్రామీణ ప్రాంతాల్లో జనాభా లెక్కల మేరకు దుకాణాలు కేటాయించారు.

తొలుత ఎవరూ ముందుకు రాక

ఒక్కో దుకాణానికి 20 వరకు దరఖాస్తులు వస్తాయన్న లెక్క అధికారులదీ కాగా తొలి రెండు మూడు రోజులు దరఖాస్తుదారులు ముందుకు రాలేదు. ఈ క్రమంలో నియోజకవర్గాల్లోని కొందరు ప్రజాప్రతినిధులు ఒత్తిడి ఉన్నట్లు ఆరోపణలొచ్చాయి. ఇలా గడవు పెంపు వరకు దుకాణానికి 8 దరఖాస్తులు లెక్కన వచ్చాయి.

ఇక్కడే నామమాత్రంగా..

శ్రీకాళహస్తి పట్టణంలోని 56-58 దుకాణాలకు 3 దరఖాస్తులు, 61, 63కు మూడు దరఖాస్తులే పడ్డాయి. సత్యవేడులో ఇదే తీరుగా రెండు లెక్కన వచ్చాయి. పాకాలలో రెండేసి, గూడూరులో ఆరు, ఏడు లెక్కన పడ్డాయి. నాయుడుపేటలో ఎక్కువ దుకాణాలకు 3, రెండు దుకాణాలకు డబుల్ డిజిట్ దరఖాస్తులు పడ్డాయి. ఓజిలిలో 20 లెక్కన, పెళ్లకూరు మండలాల్లో 13 లెక్కన వేశారు.

తడలో పోటాపోటీగా

సూళ్లూరుపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గురువారం నాటికి 23 దుకాణాలకు 162 దరఖాస్తులు అందాయి. రాష్ట్ర సరిహద్దు కావడంతో తడలో అత్యధికంగా 5 దుకాణాలకు 107 దరఖాస్తులొచ్చాయి. దొరవారిసత్రంలో 2 దుకాణాలకు 27 వచ్చాయి. సూళ్లూరుపేటలో కేవలం 28 దరఖాస్తులే రావడం గమనార్హం.

తక్కువ ధరకే వంటనూనెలు

- కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: వినియోగదారులకు మార్కెట్ ధరలకంటే తక్కువ ధరకే వంటనూనెలను అందజేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. స్థానిక భేరివీధిలో గురువారం జేసీ శుభం భన్సల్‌తో కలిసి గోపికృష్ణ ఆయిల్ స్టోర్‌లో రూ.135 విలువగల పామయిల్‌ను రాయితీపై రూ.117కు, రూ.145 విలువచేసే సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను రూ.128లకు వినియోగదారులకు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సరమైన ధరలలో నాణ్యమైన సరకులను ప్రజలకు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తిరుపతిలోని రైతు బజారు, పెద్ద సంస్థాగత రిటైల్ దుకాణాలు, రిలయన్స్, డీమార్ట్‌లలో పైతెలిపిన ధరలకు వంటనూనె లభిస్తోందన్నారు. పౌరసరఫరాల జిల్లా సరఫరాల అధికారి శేషాచలం రాజు, ఉప తహసీల్దార్లు జయరామ్, ప్రతాప్, గోపికృష్ణ, ఆయిల్ స్టార్ యాజమన్యం పాల్గొన్నారు.


మహిళలకు వంటనూనె ప్యాకెట్ అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం భన్సల్

ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు

ఇసుక నుంచి ఎలాంటి ఆదాయం ఆశించకుండా, ప్రజలకు పారదర్శకంగా అందేలా రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. త్వరలో మూడు డీసిల్టేషన్ పాయింట్ల నుంచి 1,37,686 మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ యార్డు పాయింట్లలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఇసుక రుసుములు, రవాణా తదితర వివరాలను అన్ని సచివాలయాలు, తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ కార్యాలయాల్లో ఉంచుతామన్నారు.

ఏపీఐఐసీ భూముల్లో ఇసుక నిల్వలు

నిర్మాణ సంస్థలకు అక్రమ రవాణా

నాయుడుపేట, న్యూస్‌టుడే: నిబంధనల మేరకు అనుమతులున్న ప్రాంతం నుంచే ఇసుక రవాణా చేసుకోవాలి. కానీ ఇందుకు భిన్నంగా మేనకూరు పారిశ్రామిక వాడలోని పరిశ్రమల నిర్మాణాలు, ఇతర నిర్మాణ రంగాలకు స్వర్ణముఖి నది నుంచి కొందరు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. పెళ్లకూరు మండలంలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేకున్నా కలవకూరు, పుల్లూరు, కప్పగుంటకండ్రిగ, పెళ్లకూరు రాణిగారితోట సమీపంలో స్వర్ణముఖిలోకి ర్యాంపులు ఏర్పాటు చేసి ఇసుకను నిర్మాణ సంస్థలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.


నిల్వ ఉన్న ఇసుక

రాజకీయ పరపతి కలిగిన నాయకులు, ట్రాక్టర్ల యాజమానులు ట్రాక్టర్ ఇసుకను రూ.2 వేలకు కొనుగోలు చేసి నిర్మాణ సంస్థలకు రూ.3-4 వేల వరకు విక్రయిస్తున్నారు. రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసి రాత్రి సమయంలో లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పాలచ్చూరు రోడ్డు పక్కనే ఓ నిర్మాణ సంస్థ ఏపీఐఐసీ నుంచి తాత్కాలికంగా తీసుకున్న యార్డు స్థలంలో భారీగా ఇసుక నిల్వలు ఉన్నాయి. పుల్లూరు, కలవకూరు ప్రాంతాల నుంచి వెంకటగిరి పరిసర ప్రాంతాలకు నిత్యం రాత్రి పూట వందల ట్రాక్టర్ల ఇసుక తరలిపోతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. నాయుడుపేట మండలం అన్నమేడు, తుమ్మూరు ప్రాంతాల్లో స్వర్ణముఖి నది రాత్రి బహుళ అంతస్తుల భవనాలకు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఏపీఐఐసీ జడ్‌ఎం విజయరత్నం అన్నారు.కాగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఏపీఐఐసీ జడ్‌ఎం విజయరత్నం అన్నారు.

ఆలయ భూములకు అనధికార వేలం

■ పులికాట్ తీరంలో దేవాదాయ లీజు స్వాహాకు యత్నం

పులికాట్ తీరంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి విలువైన మాన్యం భూములు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా వచ్చే లీజుపై ఆ ప్రాంతానికి చెందిన పలువురు నేతల కన్ను పడింది. ఇందుకుగాను ఆలయాన్ని నిర్మించాలని, లీజు ద్వారా వచ్చే సొమ్ము అవసరమవుతుందని వ్యూహం రచించారు. అనంతరం దేవాదాయ శాఖకు తెలియకుండానే వారి ఆధ్వర్యానే గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా వేలం నిర్వహించారు. ఇందుకు కొందరు ప్రజాప్రతినిధులు సాయం అందించినట్లు సమాచారం. **- న్యూస్‌టుడే,సూళ్లూరుపేట**


ప్రసన్న వేంకటేశ్వరస్వామి విగ్రహం

సూళ్లూరుపేట మండలంలోని పులికాట్ తీరంలో తోటకట్ల గ్రామం ఉంది. ఇక్కడ పురాతన కాలంనాటి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వెలసింది. ఆలయానికి పూర్వ కాలంలోనే దేవుని మాన్యం కింద 14 ఎకరాల పొలాన్ని కేటాయించారు. రెవెన్యూ దస్త్రాల్లోనూ ఈ భూములు ప్రసన్న వేంకటేశ్వరస్వామి పేరు మీదనే ఉన్నాయి. ఈ పొలాలు పులికాట్ తీరంలోని కొరిడి పంచాయతీలో సర్వే నంబరు 112లో 1.79 ఎకరాలు, 158లో 96 సెంట్లు, దామరాయలో సర్వే నంబరు 18లో 1.67 ఎకరాలు, 105లో 2.14 ఎకరాలు, కడపత్ర పంచాయతీలో సర్వే నంబరు 172లో 35 సెంట్లు, 196లో 2.38ఎకరాలు, 257లో 3.40 ఎకరాలు, 430లో 38 సెంట్లు ఉన్నాయి. ఈ భూములకు మూడేళ్లకోకసారి దేవాదాయ శాఖ అధికారులు గ్రామంలో వేలం నిర్వహించి, ఏటా లీజు వసూలు చేస్తున్నారు. ఈ దఫా వేలం నిర్వహించాల్సి ఉండగా గ్రామంలోని పలువురి నేతల కన్ను ఈ భూములపై పడింది. ఇందుకు ఆలయాన్ని పునఃనిర్మించాలన్న మాట తెరపైకి తెచ్చారు. అనుకున్నదే తడవుగా స్థానిక ప్రజాప్రతినిధులను కలిశారు. వారికి క్షేత్రస్థాయిలోని అంశాలు తెలియకపోవడంతో గ్రామ నేతల నిర్ణయానికి సమ్మతించారు. కొద్ది రోజుల క్రితం గ్రామంలో 14 ఎకరాల పొలాల లీజుకు వేలం నిర్వహించగా రూ.3.60 లక్షలకు రైతులు దక్కించుకున్నారు. ఆ మేరకు మండల, గ్రామ నేతలే నిర్ణయం తీసుకుని, పొలాల్లో సాగు చేసుకుని, లీజు చెల్లించాలని హుకుం జారీ చేశారు. ఈ వ్యవహారమంతా దేవాదాయ శాఖ అధికారులకు తెలియకుండానే నేతలు తమ కన్నుసన్నల్లోనే చేసేశారు.

ఆలయాన్ని నేలమట్టం చేసి..

ఆలయం శిథిల దశకు చేరడంతో గ్రామానికి చెందిన నేతలు కూలగొట్టి, కొత్తగా నిర్మించాలని తలచారు. అయితే నిర్మాణానికి వారి వద్ద నిధులు లేవు. కానీ ఆలయాన్ని 2019లో నేలమట్టం చేశారు. అప్పటి నుంచి నేటి వరకు ఇక్కడ ఎలాంటి పనులు జరగలేదు. ఆలయానికి చెందిన భూముల ద్వారా వచ్చే లీజు డబ్బులతో పనులు చేపట్టాలని చెప్పి, గ్రామంలో అనధికారికంగా వేలం నిర్వహించినట్లు తెలిసింది. నేలమట్టం చేసేటపుడు అందులోని విగ్రహాలను బాలాలయం ఏర్పాటు చేసి, వాటిల్లో పెట్టారు. వాటికి పూజలు చేస్తూ వస్తున్నారు.

గ్రామస్థుల కన్నెర్ర

వేంకటేశ్వరస్వామి మాన్యానికి చెందిన పొలాలు కొరిడి, దామరాయ, కడపత్ర పంచాయతీల్లో ఉండటం, వాటిని అనధికారికంగా నేతలే లీజుకు వేలం నిర్వహించిన విషయం గ్రామస్థులు జీర్ణించుకోలేకపోయారు. ఈ విషయమై భక్తులు దేవాదాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అసలు విషయం బయటకు వచ్చింది. దీనిపై దేవాదాయ శాఖ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. దేవాదాయ శాఖ గ్రూపు ఆలయాల ఈవో మమతను వివరణ కోరేందుకు 'న్యూస్‌టుడే' ప్రయత్నించగా ఎంతకీ అందుబాటులోకి రాలేదు.

ఇదేం బరితెగింపు

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు మండలం మన్నసముద్రం చెరువు నుంచి రాత్రీపగలు తేడా లేకుండా మట్టి అక్రమ రవాణా సాగుతోంది. రేణిగుంట సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న లేఅవుట్‌లకు అవసరమైన మట్టిని పొక్లెయిన్లతో పరిమితికి మించి తవ్వుతూ టిప్పర్లతో తరలిస్తున్నారు. దీన్ని గుర్తించిన స్థానిక తెదేపా నేతలు గురువారం రాత్రి మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు. పరిమితికి మించి తవ్వకాలు చేపట్టడంతో చెరువులో బావులను తలపించేలా గుంతలు ఏర్పడ్డాయన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.


మట్టి తవ్వకాలు చేపట్టిన యంత్రాలు

రిజర్వు డీఎస్పీలకు పదోన్నతులు.. బదిలీలు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: డిస్ట్రిక్ ఆర్మ్డ్ రిజర్వు (డీఏఆర్) డీఎస్పీలకు పదోన్నతులు.. బదిలీలు చేపడుతూ ఉత్తర్వులు జారీచేశారు. తిరుపతి జిల్లా ఆర్మ్డ్ డీఎస్పీ బి.రమణయ్యకు అదనపు కమాండెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ కడప బదిలీ చేశారు. తితిదే విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న ఆర్.శివానంద కిషోర్‌కు అదనపు కమాండెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ చిత్తూరు డీఏఆర్‌కు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న అదనపు కమాండెంట్ జి.నాగేశ్వరరావును విజయనగరం బదిలీ చేశారు. చిత్తూరు డీఏఆర్ డీఎస్పీగా పనిచేస్తున్న ఇలియాస్ బాషాకు అదనపు కమాండెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ అనంతపురం బదిలీ చేశారు.



దుర్గాదేవిగా చెంగాళమ్మ

చెంగాళమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి సూళ్లూరు, నాగరాజపురం, వాటంబేడురోడ్డు వాసులు దసరా సారె సమర్పించారు. **- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట**

14న కుప్పానికి నారా భువనేశ్వరి రాక

కుప్పం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి ఈ నెల 14 నుంచి నాలుగు రోజుల పాటు కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ దఫా నాలుగు మండలాలతో పాటు పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలంలోనూ ఆమె పర్యటిస్తారు. సోమవారం ఉదయం హైదరాబాదు నుంచి విమానంలో బెంగళూరు చేరుకుంటారు. రోడ్డుమార్గంలో వి.కోట మండలం వచ్చి.. ఎన్టీఆర్ ట్రస్టు సుజల తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తారు. తర్వాత శాంతిపురంలో మహిళలతో సమావేశమవుతారు. మొరసనపల్లెలో మహిళలతో ముఖాముఖి, కడపల్లె వద్ద నివాస భవనం నిర్మాణం పరిశీలన ఉంటాయి. 15న కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, 16, 17నన కుప్పంలో పర్యటిస్తారు.

ఏపీ ఆర్‌సెట్ మొదటి విడత సీట్ల కేటాయింపు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఏపీ ఆర్‌సెట్ 2023-24లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు గురువారం మొదటి విడత సీట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టినట్లు సెట్ ఛైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్‌రావు, కన్వీనర్ ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఫుల్‌టైం కోర్సుల్లో 771 మంది, పార్ట్ టైం కోర్సుల్లో 1,237 మందికి సీట్ల కేటాయింపు చేపట్టినట్లు వారు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో రిపోర్టు చేశాక సంబంధిత విశ్వవిద్యాలయాల్లో ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలనకు నేరుగా హాజరు కావాలని, వివరాలకు http://ets.apsche.ap.gov.in వెబ్‌సైట్ చూడాలని కోరారు.


వేడుకగా బంగారు గొడుగు ఉత్సవం

తిరుమల, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో ఆనవాయితీగా నిర్వహించే బంగారు గొడుగు ఉత్సవం గురువారం సాయంత్రం తిరుమలలో వేడుకగా జరిగింది. శుక్రవారం శ్రీవారి రథోత్సవాన్ని పురస్కరించుకుని ముందురోజు సాయంత్రం శ్రీవారి కల్యాణకట్ట సిబ్బంది ఆధ్వర్యంలో నూతన ఛత్రస్థాపనాన్ని చేస్తారు. ఇందుకోసం ప్రధాన కల్యాణకట్టలో బంగారు గొడుగుకు తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తితిదే అదనపు ఈవోకు అప్పగించారు. ప్రస్తుత పంతులుగారి వంశీకుడైన రామనాథన్ ఆధ్వర్యంలో 40 సంవత్సరాల నుంచి కల్యాణకట్ట క్షురకులు, సిబ్బంది, సభ్యులు బంగారు గొడుగులకు పూజలు నిర్వహించి స్వామివారి రథానికి సమర్పిస్తున్నారని ఇది పూర్వజన్మ సుకృతమని అన్నారు.


ప్రధాన కల్యాణకట్ట వద్ద బంగారు గొడుగుతో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, పంతులుగారి రామనాథన్ తదితరులు

టెట్‌కు 2,445 మంది హాజరు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా గురువారం నాలుగు కేంద్రాల్లో జరిగిన టెట్ పరీక్షకు మొత్తం 2,445 మంది హాజరయ్యారు. ఉదయం 1,335 మందికిగాను 1,220 మంది, మధ్యాహ్నం 1,336 మందికిగాను 1,225 మంది హాజరయ్యారు.




చంద్రప్రభ వాహనం ఎదుట తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, నందమూరి వసుంధర దేవి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తదితరులు ● కళాబృందాలతో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీషానంద దంపతులు ● శ్రీవరాహస్వామి ఆలయ సమీపంలో కుటుంబ సభ్యులతో మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ **- న్యూస్‌టుడే, తిరుమల**

వాతావరణంలో అనూహ్య మార్పులు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: కొన్నేళ్లుగా వాతావరణంలో అనూహ్య మార్పులు సంభవిస్తున్నాయని చెన్నైలోని ఎన్ఐవోటీ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్ పేర్కొన్నారు. సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో గురువారం ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. షార్ సంచాలకులు ఆర్ముగం రాజరాజన్; నియంత్రణ, విజిలెన్సు అధికారి శ్రీనివాసులురెడ్డి, ఏడీ సయ్యద్ హమీద్, డీడీలు ముత్తు చరియన్, రమేష్‌బాబు పాల్గొన్నారు.


విద్యార్థికి జ్ఞాపిక అందజేస్తున్న బాలాజీ రామకృష్ణన్, రాజరాజన్ తదితరులు

96,364 మంది భాగస్వామ్యం: ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు మూడు రాష్ట్రాల్లో తొమ్మిది కేంద్రాల్లో అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించారు. 96,364 మంది పాల్గొని అంతరిక్ష కార్యక్రమాలను తెలుసుకున్నారు. వివిధ పోటీల్లో 42,621 మంది పాల్గొనగా 2,700 మంది విజేతలుగా నిలిచారు. వీరందరికీ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

వేతనాలందక.. వెతలు

■ ఆర్థిక ఇబ్బందుల్లో విద్యుత్తు బస్సు డ్రైవర్లు
■ ఓ డ్రైవర్ ఆత్మహత్య యత్నం

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: ఆర్టీసీలో అద్దె ప్రతిపాదికన నడుస్తున్న విద్యుత్తు బస్సు డ్రైవర్లకు వేతనాలు సకాలంలో అందడం లేదు. కార్మిక చట్టాల ప్రకారం రావాల్సిన ప్రయోజనాలు సైతం కల్పించడం లేదంటూ ఆందోళన బాటపట్టారు. గుత్తేదారు సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా, ఆర్టీసీ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తిరుమల- తిరుపతి ఘాట్ రోడ్డులో నిర్వహించేలా 2022 సెప్టెంబరులో వంద విద్యుత్తు ఏసీ బస్సులను అలిపిరి డిపోకు కేటాయించారు. గత వైకాపా ప్రభుత్వం వాటిని సొంతంగా కొనుగోలు చేసే స్థోమత లేక, అద్దె ప్రతిపాదికన నడిపేలా హైదరాబాద్‌కు చెందిన 'మేఘా' సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. బస్సుల నిర్వహణ బాధ్యత, డ్రైవర్ల నియామకాలు వంటి బాధ్యతలు గుత్తేదారు సంస్థే భరించేలా ఒప్పందం చేసుకున్నారు. వంద బస్సుల్లో ప్రస్తుతం తిరుపతి- కడప 12, తిరుపతి- నెల్లూరు 12, తిరుపతి- మదనపల్లె 12, రేణిగుంట విమానాశ్రయం- తిరుమల 6, తిరుపతి- శ్రీకాళహస్తి 3, మిగిలినవి తిరుమల- తిరుపతి కనుమ దారిలో నడుస్తున్నాయి. మొత్తం 120 మంది డ్రైవర్లు ఉన్నారు.

■ ఘాట్ రోడ్డు బస్సులకు సంబంధించి ప్రతినెలా మేఘా సంస్థకు అనుబంధంగా ఉన్న యశస్విని, ఈవీ ట్రాన్స్ నుంచి జీతభత్యాలు అందడం లేదని డ్రైవర్లు వాపోతున్నారు. సెప్టెంబరు జీతం ఇంకా అందకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. జీతంతో పాటు కార్మిక చట్టం ప్రకారం కల్పించాల్సిన ఈఎస్ఐ, పీఎఫ్ ఐదు నెలలుగా కల్పించడం లేదని వాపోతున్నారు. గురువారం పాకాలకు చెందిన రఘు అనే డ్రైవర్ ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు. తోటి డ్రైవర్లు అప్రమత్తం కావడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.


డ్రైవర్లతో చర్చిస్తున్న జిల్లా డిప్యూటీ సీటీఎం భాస్కర్, డీఎం హరిబాబు, సీఐటీయూ నేతలు



● **చులకనగా చూస్తున్నారు:** మాది వడమాలపేట. 19 నెలలుగా పనిచేస్తున్నా. నెలవారీ జీతంతోనే ఆధారపడి జీవనం సాగించాల్సిన పరిస్థితి. ఆర్టీసీలో పనిచేస్తే ఉద్యోగ భరోసా, ప్రయోజనాలు ఉంటాయన్న ఆశ. గుత్తేదారు సంస్థ మా కష్టాన్ని పట్టించుకోకకుండా చులకనగా చూస్తోంది.
- నవీన్ కుమార్



● **అడిగితే వెళ్లిపోమన్నారు:** మాది కదిరి. ప్రారంభ నుంచి పనిచేస్తున్నా. ప్రతి నెలా వేతనాల ఇవ్వడంలో ఆలస్యం జరుగుతోంది. నేరుగా బ్యాంకు ఖాతాలో జమచేయకుండా ఫోన్‌పే ద్వారా కొంతకొంత ఇస్తున్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి ప్రయోజనాలు లేవు. అడిగితే వెళ్లిపో అంటూ బెదిరిస్తున్నారు.
- కె.సోముశేఖర్ నాయక్



● **వేతనాలు పెంచిన దాఖలాలు లేవు:** మాది చిత్తూరు జిల్లా బంగారుపాల్యెం. పదిహేను నెలలుగా పనిచేస్తున్నా. వేతనాలు పెంచిన దాఖలాలు లేవు. ప్రతినెలా కనీసం రూ.20వేలు చేతికి రావడం లేదు. వచ్చినదాంట్లోనే భోజనం, రానుపోను ప్రయాణ ఛార్జీలకు వాడుకుంటున్నా.
- జి.ఎన్.మేధావి

చిరుతల జాడ.. కనిపెట్టేస్తాం ఇక్కడ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: తిమ్మినాయుడుపాలెం సమీపంలోని కమర్షియల్ ట్యాక్స్ అధికారుల కాలనీలోకి కొన్ని రోజులుగా చిరుతలు వస్తున్నాయి. దాంతో గురువారం అటవీశాఖ అధికారులు ట్రాప్ కెమెరాలు అమర్చారు. కాలనీ అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండటంతో రాత్రి సమయంలో జింకలు పెద్దఎత్తున కాలనీ పరిధిలోకి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. వాటిని వేటాడేందుకు చిరుత పులులు కాలనీలోకి చొరబడుతున్నాయని, కాలనీలోని కుక్కలను చంపి తిన్నట్లు తెలిపారు. ఇవన్నీ సీసీ కెమెరాల్లో నమోదయ్యాయన్నారు. అటవీశాఖ అమర్చిన కెమెరాల్లో చిరుత సంచారంపై స్పష్టత వస్తే పట్టేందుకు బోన్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెప్పారు.


ట్రాప్ కెమెరాలు అమర్చుతున్న అటవీశాఖ సిబ్బంది

నకిలీ బంగారంతో మోసం

చంద్రగిరి, న్యూస్‌టుడే: ఓ అజ్ఞాత వ్యక్తి మాయమాటలు నమ్మి నకిలీ బంగారం కొని రూ.5 లక్షలు మోసపోయిన ఉదంతం చంద్రగిరి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. ఎ.రంగంపేట గ్రామానికి చెందిన పూజారి సుబ్రహ్మణ్యం కూలీగా పనిచేస్తుండగా ఇతని కుమారుడు వెంకటేష్ తిరుపతిలో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నాలుగునెలల కిందట గుర్తుతెలియని వ్యక్తి తన పేరు రమేష్ అని, కర్నూలుకు చెందిన తాను అప్పుడప్పుడు తిరుమలకు వస్తానని పరిచయం చేసుకున్నాడు. ఈక్రమంలో గతనెల 17న తిరుపతికి చేరుకున్న ఆయన వెంకటేష్‌ను కలిశాడు. తాము పొలం పనులు చేస్తుండగా 3.5 కిలోల బంగారు కాసుల నిధి దొరికిందని, అమ్మితే రూ.10 లక్షల వరకు వస్తాయన్నారు. దీంతో వెంకటేష్ అతన్ని ఇంటికి తీసుకువచ్చి తండ్రికి పరిచయం చేశాడు. ఆ వ్యక్తి తన మాయమాటలతో నమ్మించి చిన్న బాక్సులో గ్రాము బరువుగల బంగారు కాసు ఇచ్చి పరీక్షించుకోవాలని చెప్పాడు. దీంతో వారు గ్రామంలో పరీక్షించి అసలైనదిగా నిర్ధారించుకున్నారు. ప్రస్తుతం తనవద్ద కిలో కాసులు ఉన్నాయని, రూ.5 లక్షలకే ఇస్తానని చెప్పడంతో ఆయన కుమార్తె పెళ్లికోసం దాచుకున్న రూ.5 లక్షలు ఇచ్చి వాటిని తీసుకున్నారు. నగలు చేయించుకోవడానికని బుధవారం వాటిని పరిశీలించగా పూర్తిగా నకిలీవని తెలిసింది. బాధితుడు సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు ఎస్సై అనిత కేసు నమోదు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


బాధితుడు సుబ్రహ్మణ్యం కుటుంబం


నకిలీ బంగారం

తిరుపతి

• తిరుపతి • చంద్రగిరి

విజయానికి చిహ్నం దసరా

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: విజయానికి చిహ్నంగా జరుపుకొనే పండుగే దసరా అని రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం అన్నారు. రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో గురువారం దసరా మహోత్సవం నిర్వహించారు. పేదలకు రెండు, మూడు చక్రాల సైకిళ్లు, వినికిడి పరికరాలు, దుప్పట్లు, చేతికర్రలు పంపిణీ చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాస్ పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు, ప్రసన్న భారతి స్కూల్ ఛైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, నాగేశ్వర్, వాణి, రామాంజులు, సీతామహాలక్ష్మి, దేవి, కవిత తదితరులు పాల్గొన్నారు.



దసరా మహోత్సవంలో మాట్లాడుతున్న రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం

రతన్ టాటా చెప్పిన ఆర్థిక సూత్రాలు...

రతన్ టాటా గురించి ఆలోచించినప్పుడు మనకు గుర్తుకొచ్చేది ఏమిటి? వ్యాపార రంగంలో ప్రపంచానికి భారత శక్తిని చాటి చెప్పిన ఒక గొప్ప వ్యాపారవేత్త అనే కదా. దీన్ని సాధించే క్రమంలో ఆయన ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారు. త్యాగాలూ చేశారు. డబ్బును సంపాదించడం, దాన్ని నిర్వహించే విషయంలో ఆయన సూచనలు ఎప్పుడూ ఆచరణీయం. ఆయన చెప్పిన కొన్ని సూత్రాలేమిటంటే..



నైతికతతో...

అందరమూ డబ్బు సంపాదించాలనే చూస్తుంటాం. దాన్ని వెంబడించడం చాలా ముఖ్యం. కానీ, దాన్ని నైతికతతో చేయాలి. సంపాదన న్యాయంగా ఉన్నన్ని రోజులూ ఆర్థికంగా విజయం సాధిస్తూనే ఉంటాం. చెడు మార్గంలో, తొందరగా డబ్బును కూడబెట్టాలనుకుంటే మాత్రం పతనం ప్రారంభమవుతుంది.

ఇవ్వడం నేర్చుకోండి..

మనం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పుడే అన్నీ తిరిగి మనకు అందుతాయి. మంచి పనులు, డబ్బు ఈ రెండింటికీ ఇదే సూత్రం వర్తిస్తుంది. అవసరంలో ఉన్న వారిని మీరు ఆర్థికంగా ఆదుకుంటే.. మీకు కావాలి అనుకున్నప్పుడు మీ రూపం లోనైనా, ఎవరి నుంచైనా సహాయం అందుతుంది. అది మీకు వృత్తిలోనూ, ఆర్థికంగానూ మేలు చేకూరుస్తుంది.

అవకాశాలు తీసుకోండి..

అన్నీ సజావుగానే సాగుతున్నాయి కదా అనే ధోరణి నుంచి బయటపడాలి. అప్పుడే మీరు డబ్బు విషయంలోనూ, వృత్తి, ఉద్యోగ జీవితంలోనూ వృద్ధి సాధిస్తారు. అవకాశాలను వదులుకోవద్దు. ధైర్యంగా, తెలివిగా ఉండాలి. ప్రతి రోజూ మీ గురించి మీరు సమీక్షించుకోవడం ఎంతో అవసరం.

నిర్ణయాలను గౌరవించండి..

మీరు తీసుకునే నిర్ణయాలను విశ్వసించండి. మంచివా, చెడువా అనేది తర్వాత విషయం. ఒక నిర్ణయం తీసుకునే ముందే దాని గురించి పూర్తిగా విశ్లేషించుకోవాలి. ముఖ్యంగా డబ్బును పెట్టుబడి పెట్టేటప్పుడు. దాని ఫలితం ఎలా ఉంటుందో ముందే అంచనా వేసుకోవాలి. ఒకసారి నిర్ణయం తీసుకున్నాక, దాన్ని సరైనదిగా మార్చుకునేందుకు ప్రయత్నించాలి.

తెలివిగా పెట్టుబడులు..

ఒకే చోట పెట్టుబడులు పెట్టడం వల్ల డబ్బు సంపాదించే అవకాశాలను కోల్పోతాం. అందుకే, వైవిధ్యానికి పెద్దపీట వేయాలి. ఎన్నో రంగాల్లో విస్తరించిన టాటా గ్రూపు ఇందుకు ఉదాహరణ. మన పెట్టుబడులూ అనేక పథకాల్లో ఉండేలా చూసుకోవాలి. ఇందులో కొన్నింటిలో నష్టభయం ఉండొచ్చు. కొన్ని సురక్షితంగా కనిపిస్తాయి. వీటన్నింటినీ సమన్వయం చేసుకుంటూ సాగినప్పుడే ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోగలం.



క్రమానుగత పెట్టుబడి విధానం(సిప్)లో మదుపు చేస్తున్న వారి సంఖ్య ప్రతి నెలా పెరుగుతోంది. మార్కెట్లోకి ప్రవేశించాలనుకునే వారిలో చాలామంది యువతే ఉంటున్నారని ఇటీవలి నివేదికలూ చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఈక్విటీ పెట్టుబడులు పెట్టేవారు అనుసరించాల్సిన వ్యూహాలు తెలుసుకుందాం.

ఇవీ ముఖ్యమే...

- మార్కెట్ హెచ్చుతగ్గుల సమయంలో క్రమశిక్షణతో ఉండండి. ఫండ్‌లను ఎంపిక చేసుకునేటప్పుడు కేవలం స్వల్పకాలిక రాబడిపైనే దృష్టి పెట్టొద్దు.
- ఇటీవలి కాలంలో మంచి పనితీరు చూపిస్తే, దానినే ఆ ఫండ్లను ఎంచుకోవడానికి ప్రామాణికంగా చూడొద్దు.
- దశల వారీగా పెట్టుబడులు కొనసాగించండి. మార్కెట్ పడిపోతున్నప్పుడూ పెట్టుబడులు కొనసాగాలి. క్రమం తప్పకుండా పెట్టుబడులు పెట్టడంపైనే దృష్టి సారించండి.
- ప్రారంభంలోనే ఒకే రంగానికి పరిమితమయ్యే సెక్టోరియల్ ఫండ్లపై ఎక్కువగా దృష్టి పెట్టొద్దు.
- మార్కెట్లో అస్థిరతకు సిద్ధంగా ఉండాలి. సూచీల్లో 10-20 శాతం క్షీణత సర్వసాధారణం. ఇప్పుడు మార్కెట్లోకి వస్తున్న మదుపరులు 30 శాతం తగ్గినా ఇబ్బంది లేదు అనే ధోరణితో ఉండాలి.

సిరి

కొత్తగా సిప్ చేస్తుంటే

స్టాక్ మార్కెట్ సూచీలు గరిష్ఠ స్థాయుల్లో కొనసాగుతున్నాయి. ఇలాంటప్పుడు పెట్టుబడులు కొంచెం నష్టభయంతో కూడుకున్నవే. అయినప్పటికీ.. సిప్ ద్వారా మార్కెట్లో ఉన్న అవకాశాలను అందుకునేందుకు వీలుంది.

నిధిని సృష్టించండి: అత్యవసర పరిస్థితుల్లో దీర్ఘకాలిక పెట్టుబడుల నుంచి డబ్బును తీయకుండా ఉండాలి. ఇందుకోసం కనీసం ఆరు నెలల ఖర్చులకు సరిపోయే మొత్తం మీకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. ఇందుకోసం లిక్విడ్ ఫండ్లలో సిప్ చేయొచ్చు.

మధ్యస్థ కాలానికి: చాలామంది యువ పెట్టుబడిదారులకు కొన్ని మధ్యస్థ కాల లక్ష్యాలు ఉంటాయి. ఇలాంటి అవసరాల కోసం విడిగా మదుపు చేయాలి. ఉదాహరణకు కారు కొనాలని అనుకోవచ్చు. లేదా ఇంటి కోసం ముందస్తు చెల్లింపు కావచ్చు. ఇలాంటి వాటన్నింటికీ ప్రత్యేకంగా ఒక సిప్‌ను ప్రారంభించాలి. స్వల్పకాలిక డెట్ ఫండ్లను ఇందుకోసం ఎంపిక చేసుకోవచ్చు.

దీర్ఘకాలిక లక్ష్యంతో: మీరు సాధించాల్సిన లక్ష్యం 15-20 ఏళ్లు, అంతకు మించి ఉంటే.. దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టాలి. పిల్లల ఉన్నత చదువులు, మీ పదవీ విరమణ లాంటివి ఇందుకు ఉదాహరణ. ఇందుకోసం నష్టభయాన్ని భరించే సామర్థ్యం ఆధారంగా 80-90 శాతం వరకూ ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలో మదుపు ప్రారంభించాలి.

కొత్తగా మార్కెట్లోకి ప్రవేశించే వారు నిఫ్టీ లేదా సెన్సెక్స్ సూచీల ఆధారంగా పనిచేసే లార్జ్ క్యాప్ ఫండ్లను పరిశీలించాలి. ఈక్విటీలంటేనే అస్థిరతకు మారుపేరు. వీటికి మానసికంగా అలవాటు కావాలి. ఇందుకోసం కనీసం రెండు మూడేళ్ల సమయం పడుతుంది. ఆ తర్వాతే నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ వంటి వాటికి కొంచెం ఎక్కువ మొత్తంలో పెట్టుబడిని కేటాయించాలి.

పెట్టుబడుల్లో కాస్త అనుభవం వచ్చాక దీర్ఘకాలిక పోర్ట్‌ఫోలియోను సిద్ధం చేసుకోవాలి. ఇందులో 70-80 శాతం వరకూ నిఫ్టీ ఇండెక్స్ ఫండ్లు, వాల్యూ ఫండ్, లో వోలటాలిటీ ఫండ్లవంటివి ఉండాలి. ఆ తర్వాతే.. అధిక రాబడి కోసం ప్రయత్నించాలి. స్మాల్, మిడ్ క్యాప్ ఫండ్లలో అస్థిరత అధికంగా ఉంటుంది. అదే సమయంలో లాభాలకూ అవకాశం ఉంటుంది. అనుభవం వచ్చాకే వీటిపై దృష్టి పెట్టాలి.

వైవిధ్యంగానూ: కేవలం ఈక్విటీల్లోనే పెట్టుబడులు పెట్టడం మంచిది కాదు. డెట్, బంగారం, ఇతర పథకాలనూ పరిశీలించాలి. పెట్టుబడుల్లో కనీసం 20 శాతం వరకూ వీటికి కేటాయించాలి. అప్పుడే పోర్ట్‌ఫోలియో స్థిరంగా ఉంటుంది.

షేర్ల విలువ తగ్గినప్పుడు...

స్టాక్ మార్కెట్లో కొన్ని సందర్భాల్లో మంచి కంపెనీల షేర్లు తక్కువ ధరకు లభిస్తుంటాయి. ఇలాంటి వాటిల్లో మదుపు చేసినప్పుడు దీర్ఘకాలంలో మంచి లాభాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది. ఇలాంటి వ్యూహంతోనే యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ నుంచి ఒక కొత్త పథకం అందుబాటులోకి వచ్చింది. యాక్సిస్ నిఫ్టీ 500 వాల్యూ 50 ఇండెక్స్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 18 వరకూ అందుబాటులో ఉండనుంది. కనీస పెట్టుబడి రూ.100. ఈ ఓపెన్ ఎండెడ్ పథకం ఇండెక్స్ ఫండ్స్ రకానికి చెందింది. నిఫ్టీ 500 వాల్యూ 50 టీఆర్ఐ సూచీ ప్రామాణికంగా పనిచేస్తుంది. నిఫ్టీ 500లో వాస్తవిక ధరకన్నా తక్కువ ధరకు లభిస్తున్న కంపెనీలను ఎంచుకొని, పోర్ట్‌ఫోలియోను నిర్మిస్తుంది. దీర్ఘకాలం పాటు మదుపు చేయాలనుకునే మదుపరులకు ఈ పథకం అనుకూలమని చెప్పొచ్చు.

వేచి చూసే వ్యవధి తక్కువగా

ఆరోగ్య బీమా పాలసీ తీసుకున్నప్పుడు ముందస్తు వ్యాధుల చికిత్సకు సాధారణంగా 36 నెలల పాటు వేచి ఉండే వ్యవధి ఉంటుంది. దీనికి భిన్నంగా పాలసీ తీసుకున్న 31 రోజు నుంచే ఇలాంటి వ్యాధుల చికిత్సకు పరిహారం అందించేలా మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ 'సర్వ' పేరుతో సరికొత్త పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీలో ప్రధానంగా మూడు ఆప్షన్లు ఉన్నాయి. సర్వ ప్రథమ్‌లో క్యాన్సర్, గుండె జబ్బులు ఇతరత్రా వ్యాధుల చికిత్సకు సంబంధించి రూ.3 కోట్ల వరకూ బీమాను తీసుకోవచ్చు. మధుమేహం, అధిక రక్తపోటు, ఆస్తమా, ఊబకాయం వంటి ముందస్తు వ్యాధుల చికిత్సకూ 31 రోజుల తర్వాత పరిహారం లభిస్తుంది. సర్వ ఉత్తమ్‌లోనూ సారథి అనే ఆప్షన్ కింద 31 రోజు నుంచి ముందస్తు వ్యాధుల చికిత్సకు పరిహారం అందుతుంది. ఇక సర్వ పరమ్‌లో ఎలాంటి వేచి ఉండే వ్యవధీ లేదు. ఇందులో 'గుల్లక్ అడ్వాంటేజ్' ఆప్షన్‌లో క్లెయిములతో సంబంధం లేకుండా ఏటా 100 శాతం వరకూ పాలసీ విలువ పెరుగుతుంది. ఇలా గరిష్ఠంగా 10 రెట్ల వరకూ పాలసీ విలువ అధికం అవుతుంది. వీటన్నింటిలోనూ ఆసుపత్రిలో చేరే 90 రోజుల ముందు, ఇంటికి వచ్చాక 180 రోజుల వరకూ అయ్యే ఖర్చులు చెల్లించేలా ఏర్పాటు ఉంది. రూ.3 కోట్ల వరకూ వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీని అందిస్తాయి. గడువు ముగియడానికి 30 రోజుల ముందే పాలసీని పునరుద్ధరిస్తే ప్రీమియంపై 2.5 శాతం వరకూ రాయితీ లభిస్తుంది. ఇద్దరు లేదా అంతకు మించి కుటుంబ సభ్యులకు కలిసి ఒకే పాలసీని తీసుకుంటే 10 శాతం వరకూ 'ఫ్యామిలీ డిస్కౌంట్' అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది.

కొత్త పథకం

జీవితాంతం పింఛను అందేలా

పదవీ విరమణ అనంతరం జీవితాంతం వరకూ పింఛను అందించే డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్‌ను రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిపేరు రిలయన్స్ నిప్పాన్ లైఫ్ నిశ్చిత్ పెన్షన్. ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం 2041 నాటికి దేశ జనాభాలో 15.9 శాతం మంది 60 ఏళ్లకు పైబడిన వారే ఉంటారు. ఈ నేపథ్యంలో పింఛను పథకాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా చిన్న కుటుంబాలు పెరుగుతున్నందున ఆర్థికంగా ఎవరి మీదా ఆధారపడాల్సిన అవసరం లేకుండా డిఫర్డ్ యాన్యుటీ పథకాలు తోడ్పడతాయని సంస్థ పేర్కొంది. ఈ పాలసీలో జీవితాంతం వరకూ పింఛను వచ్చేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఆ తర్వాత జీవిత భాగస్వామి, పిల్లలకు, తోబుట్టువులకూ పింఛను అందే ఏర్పాటు చేయొచ్చు. 5 నుంచి 10 ఏళ్ల వరకూ పాలసీకి ప్రీమియం చెల్లించే ఏర్పాటు ఉంది. ఏదైనా అనుకోని అనారోగ్యం, వైకల్యం సంభవించినప్పుడు డబ్బును వెనక్కి తీసుకునే వీలుంది.

పరిశుభ్ర ఇండియా మనందరి లక్ష్యం



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునిత బిల్లా తదితరులు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: పరిశుభ్రత.. పచ్చదన ఇండియా మనందరి లక్ష్యం కావాలని ఆదాయపు పన్ను శాఖ తిరుపతి ప్రిన్సిపల్ కమిషనర్ సునిత బిల్లా, జాయింట్ కమిషనర్ టీవీ వంశీధర్ అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా గురువారం ఆదాయ పన్ను శాఖ అధికారులు, సిబ్బంది వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. క్లీన్ ఇండియా.. గ్రీన్ ఇండియా నినాదాలు చేశారు. కార్యాలయంలోని పాత రికార్డులను తొలగించారు. బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేశారు.

సౌకర్యవంతంగా బీవోబీ సేవలు



ఆధునికీకరించిన ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న జీఎం రితేష్ కుమార్ తదితరులు

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: వినియోగదారులకు మరింత సౌకర్యవంతంగా బ్యాంకింగ్ సేవలు అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) జీఎం, జోనల్ హెడ్ రితేష్ కుమార్ అన్నారు. తిరుపతిలోని ప్రధాన శాఖలో ఆధునికీకరించిన ప్రాంగణాన్ని గురువారం ప్రారంభించారు. తిరుపతిలోనే దాదాపు లక్షమంది వినియోగదారులకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. బ్యాంక్ గ్లోబల్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్‌ను ఎంపిక చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. డీజీఎం ఎంవీఎస్ సుధాకర్, రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామమూర్తి, శాఖల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

55 వేలమందికి జియో ట్యాగింగ్



చిన్నారుల కుటుంబసభ్యులతో ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు రామకృష్ణ, సౌజన్య, సీఐ శ్రీనివాస్ తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో చిన్నపిల్లలు, వృద్ధులు, వికలాంగులు తప్పిపోకుండా పోలీసుల జియో ట్యాగింగ్ కొనసాగుతోంది. గురువారం వరకు 55 వేల మంది మంది పిల్లలకు ట్యాగింగ్ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక పోలీస్ కంట్రోల్ కేంద్రం ఇన్‌ఛార్జి, అదనపు ఎస్పీ సౌజన్య ఆధ్వర్యంలోని బృందం సభ్యులు తప్పిపోయిన కర్నూలు జిల్లా రామదుర్గానికి చెందిన అశ్విత(10)ను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. అదనపు ఎస్పీతోపాటు సభ్యులు సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు స్వప్న, కృష్ణపావనిలను ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ట్రెక్కింగ్ విజయవంతం



ఆలయం ఎదుట కేడెట్ల బృందం

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్‌కు చెందిన 35(ఆంధ్ర) బెటాలియన్ గురువారం తిరుమల ట్రెక్కింగ్ యాత్ర చేపట్టింది. బెటాలియన్‌కు చెందిన 506 మంది ఎన్‌సీసీ కేడెట్లు, 15 మంది శాశ్వత శిక్షకులు, 13 మంది అసోసియేటెడ్ ఎన్‌సీసీ అధికారులతో కూడిన బృందం శ్రీవారి మెట్టు మార్గంలో ఏపీ ట్రెక్-1 అనే ట్రెక్కింగ్ యాత్రను నిర్వహించింది. శ్రీవారిని దర్శించుకుని యాత్ర పూర్తి చేశారు.

రథోత్సవానికి సర్వం సిద్ధం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం జరగనున్న రథోత్సవానికి తేరు సిద్ధమైంది. ఆలయానికి పుష్పాలంకరణ మార్పు చేశారు. గురువారం వాహన సేవలకు సాంస్కృతిక వైవిధ్యం కనిపించేలా వివిధ రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. తితిదే హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 16 బృందాలు, 405 మంది కళాకారులు పాల్గొని తమ నైపుణ్యం ప్రదర్శించారు.

■ తిరుమలలోని నాదనీరాజనం, ఆస్థాన మండపంలో తితిదే హిందూ ధార్మికప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన ధార్మిక, సంగీత కార్యక్రమాలు అలరించాయి.




తిరుమల శ్రీవారి ఆలయానికి పుష్పాలంకరణ ● విహారానికి ముస్తాబైన తేరు

శ్రీవారి పుష్కరిణిలో రోజంతా పవిత్రత

శ్రీవారి చక్రస్నానం పవిత్రత రోజంతా ఉంటుందని, భక్తులు సంయమనం పాటించి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించాలని తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి కోరారు. గురువారం స్థానిక అన్నమయ్య భవనంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరి అంకమైన ఈ నెల 12న చక్రస్నాన ఏర్పాట్లపై అదనపు ఈవో, అధికారులతో సమీక్షించారు.

■ **తిరుపతి (గ్రామీణ):** తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం మలయప్పస్వామి సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

14న ఎన్నికల నోటిఫికేషన్

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తితిదే ఉద్యోగుల సహకార బ్యాంకు ఎన్నికల షెడ్యూల్ ఖరారైంది. ఏడుగురు పాలక మండలి డైరెక్టర్లుగా ఉండే బ్యాంకుకు ఈ నెల 14వ తేదీన నోటిఫికేషన్‌ను వెలువరించేందుకు జిల్లా సహకార శాఖ విభాగం అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. 28న ఎన్నికలను నిర్వహించేందుకు తేదీ నిర్ణయించినట్లు సమాచారం.

మానసిక ఒత్తిడి అధిగమించాలి

తిరుపతి(వైద్యవిభాగం): మానసిక ఒత్తిడి అధిగమిస్తేనే ఆరోగ్యం సాధ్యమని శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఉషా కళావత్, మానసిక వైద్య విభాగాధిపతి గణేష్‌కుమార్, ప్రొఫెసర్ వనజాక్షమ్మ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్విమ్స్ నుంచి వాల్మీకి కూడలి వరకు వాక్‌థాన్ నిర్వహించారు. శ్రీ పద్మావతి ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.

శాశ్వత ఉద్యోగులుగా ఇద్దరు ఏఈలు

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తితిదేలో 30 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎస్.శ్రీబాలాజీ, కేఎన్ వెంకటేష్‌లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

రతన్ టాటాకు ఘన నివాళి

తిరుపతి (వైద్యవిభాగం, బైరాగిపట్టెడ): పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా గొప్ప మనవతావాదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అన్నారు. గురువారం టాటా క్యాన్సర్ ఆసుపత్రిలో టాటా చిత్రపటానికి నివాళి అర్పించారు. దంపూరి భాస్కర్ యాదవ్, డాక్టర్ ప్రశాంత్, మహేష్ యాదవ్, బండ్ల లక్ష్మీపతి రాయల్, రమణరాజు పాల్గొన్నారు. **తిరుపతి (గ్రామీణ):** పెరుమాళ్లపల్లి పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ ఆధ్వర్యంలో టాటా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

తిరుపతి (బైరాగిపట్టెడ): రతన్ టాటా అస్తమించడం దేశానికి తీరని లోటని రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ డా.రమేష్‌నాథ్ లింగుట్ల ప్రెస్‌క్లబ్‌లో అన్నారు.



రతన్ టాటా చిత్రపటానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

'కూటమి అభివృద్ధి జగన్ రాసుకోవాలి'

తిరుపతి(భవానీనగర్): మాజీ సీఎం జగన్ ఎన్డీఏ కూటమిపై గుడ్‌బుక్ రాస్తానని ప్రకటించారని, ఆయన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో జరిగే అభివృద్ధిని రాసుకోవాలని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి సూచించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు.

ట్రావెల్స్ బస్సులో బ్యాగ్ మాయం

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణికుడి సంచి కనబడకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. తిరుపతికి చెందిన కార్తీక్ నాయక్ బెంగళూరు నుంచి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో తిరుపతికి వచ్చారు. బస్సు ఎక్కే సమయంతో లగేజీ బస్సు అండర్ కారిడార్‌లో సిబ్బంది పెట్టారు. తిరుపతికి వచ్చాక తీసుకునే క్రమంలో సంచి కనబడలేదు. అందులో కొంత బంగారం ఉన్నట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ విషయంగా విచారిస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

చంద్రగిరి, న్యూస్‌టుడే: పూతలపట్టు-నాయుడుపేట మార్గం నాగాలమ్మ మలుపు వద్ద రోడ్డు పక్కన ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరోలారీ గురువారం ఢీకొంది. ఈ ఘటనలో లారీ ముందు భాగం నుజ్జు కాగా డ్రైవరు సుబ్రహ్మణ్యం క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రగాయాలకు గురయ్యాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

శెట్టిపల్లె భూముల బాధ్యత తుడాకు



శెట్టిపల్లె భూముల్లో పర్యటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం భన్సల్, కమిషనర్ మౌర్య

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: శెట్టిపల్లె భూముల అభివృద్ధి, లేఔట్ రూపకల్పన బాధ్యతలను నగరపాలక నుంచి తుడాకు అప్పజెప్పుతున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి అర్బన్ మండలం మంగళం పరిధిలోని శెట్టిపల్లె భూములను గురువారం జేసీ శుభం భన్సల్, కమిషనర్ మౌర్య, రెవెన్యూ, తుడా అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. భూములను రెండు రోజుల్లో సర్వే చేసి, సరిహద్దులు గుర్తించి, తుడాకు రికార్డులను అప్పగించనున్నట్లు చెప్పారు. ఇళ్ల స్థలాల కొనుగోలుదారులకు ప్రభుత్వ జీవో ప్రకారం 2 సెంట్లకు తగ్గకుండా ప్లాట్లు కేటాయిస్తామని, 50 అంకణాలకు మించి స్థలం ఉన్నవారికి 50 శాతం కేటాయిస్తామన్నారు.

యువతి ప్రాణాలు కాపాడిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించిన యువతి సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే ప్రాణాలతో కాపాడారు. రాయచోటికి చెందిన ఓ యువతి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతోంది. ఆత్మహత్య చేసుకుంటానంటూ.. మత్తు మాత్రలు వేసుకునే వీడియోను కుటుంబ సభ్యులకు పంపింది. కుటుంబ సభ్యులు ఆ వీడియోను డీజీపీ కంట్రోల్‌రూమ్‌కు పంపి బిడ్డను కాపాడాలని కోరారు. అక్కడి నుంచి సమాచారం రావడంతో అలిపిరి సీఐ రామ్‌కిషోర్ సిబ్బందితో కలసి దర్యాప్తు చేశారు. యువతి సెల్‌ఫోన్ స్విచాఫ్ ఉండగా.. అప్పటి వరకు మాట్లాడిన ఫోన్ నంబర్లను గుర్తించి ఆరా తీశారు. వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురైన ఆ యువతి. . స్నేహితుడి గదికి వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడింది.

వ్యసనాలకు దూరంగా ఉండండి

తిరుపతి(వైద్యవిభాగం): మానసిక రోగులు వ్యసనాలకు మరింత దూరంగా ఉండాలని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ పేర్కొన్నారు. రుయాలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. రుయా సూపరింటెండెంట్ రవిప్రభ వైద్యులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి(ఆర్టీసీ): తిరుమల-తిరుపతి ఘాట్ రోడ్డు విద్యుత్తు బస్సు డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసుబ్రహ్మణ్యం, కందారపు మురళి, నాయకులు డిమాండ్ చేశారు. అలిపిరి డిపో వద్ద గురువారం డ్రైవర్లకు మద్దతుగా నిరసన వ్యక్తం చేశారు. జిల్లా డిప్యూటీ సీటీఎం భాస్కర్ వచ్చి.. వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

తిరుపతి	: 80080 20003
చంద్రగిరి	: 80085 74561
పాకాల	: 80085 74563

న్యూస్‌టుడే, తిరుపతి(నగరపాలిక)

సమస్య : రాములవారి గుడి ఉత్తర మాఢవీధిలో ఎప్పుడు చూసినా చెత్తదిబ్బలు కనిపిస్తున్నాయి. స్థానికులు కాలువ సమీపంలో వేసి వెళ్తున్నారు.

– శివయ్య, భక్తుడు

సమాధానం: మాఢ వీధిలో చెత్తవేసే వారిని గుర్తించి చర్యలు చేపడతాం.

– డా.యువఅన్వేష్, వైద్యాధికారి, నగరపాలిక

న్యూస్‌టుడే, యర్రావారిపాలెం

సమస్య: కమలయ్యగారిపల్లి పంచాయతీలో మురుగు నీటి కాలువల్లో చెత్తాచెదారం నిండి దుర్గంధం వెదజల్లుతోంది. దోమల ఉద్ధృతి ఎక్కువగా ఉంది.

– శ్రీనివాసులు, స్థానికుడు

సమాధానం: కార్మికులతో శుభ్రం చేయించి దోమల నివారణకు చర్యలు చేపడతాం.

– సతీష్, పంచాయతీ కార్యదర్శి

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు



కోచ్ కుమార్ షణ్ముగంతో నాగూర్‌వల్లి

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

రేణిగుంట, న్యూస్‌టుడే: వైఎస్ఆర్ జిల్లాలో ఈ నెల 1న నిర్వహించిన జిల్లాస్థాయి కరాటే పోటీల్లో రేణిగుంట మండలం గురవరాజుపల్లెకు చెందిన నాగూర్‌వల్లి ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపికయ్యాడని కరాటే కోచ్ కుమార్ షణ్ముగం గురువారం తెలిపారు. రేణిగుంటలో ఆయన మాట్లాడుతూ.. నాగూర్‌వల్లి బాలుర విభాగం అండర్-19లో 74 కిలోల విభాగంలో ప్రతిభ చాటాడన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

సమస్య: పట్టణంలోని బూడిదమిట్టలో మురుగునీటి కాల్వల్లో మురుగు సక్రమంగా తొలగడం లేదు. దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. **- రాఘవయ్య, బూడిదమిట్ట**

సమాధానం: రోజూవారీ తొలగింపు జరుగుతోంది. ఎక్కడ వ్యర్థాలు పేరుకుపోయాయో గుర్తించి పరిష్కరిస్తాం.
- శ్రీకాంత్, మేస్త్రీ, పారిశుద్ధ్య విభాగం

బాధ్యతల స్వీకరణ



మొహమ్మద్ రఫీ

నాగలాపురం, న్యూస్‌టుడే: నూతన ఎంపీడీవోగా మొహమ్మద్ రఫీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న రాధారాణి కేవీబీపురం మండలానికి బదిలీ కాగా, వి.కోట ఎంపీడీవోగా పనిచేస్తున్న మొహమ్మద్ రఫీ ఇక్కడకు బదిలీ అయ్యారు.

మండపాలు పూర్తి చేయాలి


శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కైలాసగిరి ప్రదక్షిణ మార్గంలో అసంపూర్తిగా ఉన్న విడిది మండపాలను సత్వరం పూర్తి చేయాలని ఆలయ ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కోరారు. ఈ సందర్భంగా గురువారం ఆయన అసంపూర్తిగా ఉన్న మండపాలను పరిశీలించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో చంద్రశేఖర్ ఆజాద్ మండపాలు పూర్తి చేయించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

సత్యవేడు : సత్యవేడు, దాసుకుప్పం సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు సత్యవేడు జేఈ రాజ్‌కిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



శ్రీకాళహస్తి: వేపాకు చీరలతో దర్శనమిస్తున్న ముత్యాలమ్మ



నారాయణవనం: మహాలక్ష్మి దేవిగా శ్రీఅవనాక్షమ్మ



సత్యవేడు: దుర్గాదేవి అలంకరణలో శ్రీసర్వమంగళాదేవి



వరదయ్యపాళెం: అంబూరులో దుర్గాదేవిగా కామక్షమ్మ

కామాక్షమ్మా.. కరుణించవమ్మా

విజయదశమిని పురస్కరించుకుని గురువారం శక్తి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కామాక్షి, మహాలక్ష్మి, మహిషాసుర మర్దని, దుర్గాదేవి తదితర రూపాల్లో అమ్మవారిని అర్చకులు అలంకరించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.


- న్యూస్‌టుడే బృందం



ఏర్పేడు: గుడిమల్లంలో దుర్గాదేవి అలంకరణలో శ్రీఆనందవల్లిదేవి



రేణిగుంట: గాజుల అలంకరణలో అమ్మవారు



నారాయణవనం: మహిషాసుర మర్దనిగా శ్రీద్రౌపదిదేవి



తొట్టంబేడులో: దుర్గాదేవి అలంకరణలో బంగారమ్మ

యుద్ధాలు శ్రేయస్కరం కాదు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మారణహోమానికి కారణమయ్యే యుద్ధాలు శ్రేయస్కరం కాదని సీపీఎం పట్టణ కార్యదర్శి మణి అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్షాల నేతృత్వంలో గురువారం నిరసన చేపట్టారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ పైశాచికంగా దాడులు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు గురవయ్య, కుమార్, వెలివేంద్రం, లాల్‌బాషా, వెంకటేష్ పాల్గొన్నారు.

మద్యం.. పోటీలు తీవ్రతరం

నిరీక్షిస్తున్న గుత్తేదారులు

శ్రీకాళహస్తి: మద్యం దుకాణాల ఏర్పాటుకు ఎప్పుడెప్పుడా అంటూ నిరీక్షిస్తూ వచ్చిన గుత్తేదారులు తీరా టెండర్లు వేసేందుకు అంతగా ఆసక్తిని చూపించకపోవడం చర్చనీయాంశంగా మారుతోంది. ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అమల్లోకి తీసుకువస్తున్నామని ప్రకటన చేసినప్పటి నుంచి అన్నీ పార్టీల్లోనూ గుత్తేదారులు ఎప్పుడెప్పుడానంటూ నిరీక్షిస్తూ వచ్చారు. శ్రీకాళహస్తి ఎక్సైజ్ వలయ పరిధిని పరిశీలిస్తే 30 దుకాణాలకు అధికారులు టెండర్ల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. అయితే పట్టణ ప్రాంతాల్లోని దుకాణాలకు డిమాండ్ లేకపోవడం.. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం పోటీ ఎక్కువగా ఉండటోంది.

పట్టణంలో పేలవం

శ్రీకాళహస్తి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతానికి సంబంధించి 12 దుకాణాల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు సిద్ధం చేశారు. ఇందుకు గాను 55, 64 దుకాణాలకు ఇప్పటి వరకు కాస్తంత పోటీ కన్పిస్తోంది. మిగిలిన వాటికి ఇద్దరు, లేదా ముగ్గురు మాత్రమే టెండర్లు దాఖలు చేయడం విశేషం. టెండర్లు వేయడంలో ఉద్దేశపూర్వక సమస్యలున్నట్లు గుత్తేదారులు చర్చించుకోవడం చర్చనీయాంశంగా మారుతోంది.

గ్రామీణంలో పోటీ తీవ్రం

ఇక్కడి ఎక్సైజ్ వలయ పరిధిని పరిశీలిస్తే బుచ్చినాయుడుకండ్రిగ 5, కేవీబీపురం 3, తొట్టంబేడు 3, ఏర్పేడు మండలాలకు సంబంధించి ఏడు దుకాణాలకు టెండర్లు పిలిచారు. అయితే మిగిలిన మండలాల్లో పోలిస్తే కేవీబీపురం మండలంలో దుకాణాలు దక్కించుకునేందుకు టెండర్ దారుల మధ్య పోటీ తీవ్రతరంగా కన్పిస్తోంది. పట్టణంతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లోనే దుకాణాలకు ఎక్కువ డిమాండ్ ఉంటోంది.

రతన్ టాటా చెప్పిన ఆర్థిక సూత్రాలు...

రతన్ టాటా గురించి ఆలోచించినప్పుడు మనకు గుర్తుకొచ్చేది ఏమిటి? వ్యాపార రంగంలో ప్రపంచానికి భారత శక్తిని చాటి చెప్పిన ఒక గొప్ప వ్యాపారవేత్త అనే కదా. దీన్ని సాధించే క్రమంలో ఆయన ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారు. త్యాగాలూ చేశారు. డబ్బును సంపాదించడం, దాన్ని నిర్వహించే విషయంలో ఆయన సూచనలు ఎప్పుడూ ఆచరణీయం. ఆయన చెప్పిన కొన్ని సూత్రాలేమిటంటే..



నైతికతతో...

అందరమూ డబ్బు సంపాదించాలనే చూస్తాం. డబ్బును వెంబడించడం చాలా ముఖ్యం. కానీ, దాన్ని నైతికతతో చేయాలి. సంపాదన న్యాయంగా ఉన్నన్ని రోజులూ ఆర్థికంగా విజయం సాధిస్తూనే ఉంటాం. చెడు మార్గంలో, తొందరగా డబ్బును కూడబెట్టాలనుకుంటే మాత్రం పతనం ప్రారంభమవుతుంది.

ఇవ్వడం నేర్చుకోండి..

మనం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పుడే అన్నీ తిరిగి మనకు అందుతాయి. మంచి పనులు, డబ్బు ఈ రెండింటికీ ఇదే సూత్రం వర్తిస్తుంది. అవసరంలో ఉన్న వారిని మీరు ఆర్థికంగా ఆదుకుంటే.. మీకు కావాలి అనుకున్నప్పుడు మీ రూపం లోనైనా, ఎవరి నుంచైనా సహాయం అందుతుంది. అది మీకు వృత్తిలోనూ, ఆర్థికంగానూ మేలు చేకూరుస్తుంది.

అవకాశాలు తీసుకోండి..

అన్నీ సజావుగానే సాగుతున్నాయి కదా అనే ధోరణి నుంచి బయటపడాలి. అప్పుడే మీరు డబ్బు విషయంలోనూ, వృత్తి, ఉద్యోగ జీవితంలోనూ వృద్ధి సాధిస్తారు. అవకాశాలను వదులుకోవద్దు. ధైర్యంగా, తెలివిగా ఉండాలి. ప్రతి రోజూ మీ గురించి మీరు సమీక్షించుకోవడం ఎంతో అవసరం.

నిర్ణయాలను గౌరవించండి..

మీరు తీసుకునే నిర్ణయాలను విశ్వసించండి. మంచివా, చెడువా అనేది తర్వాత విషయం. ఒక నిర్ణయం తీసుకునే ముందే దాని గురించి పూర్తిగా విశ్లేషించుకోవాలి. ముఖ్యంగా డబ్బును పెట్టుబడి పెట్టేటప్పుడు. దాని ఫలితం ఎలా ఉంటుందో ముందే అంచనా వేసుకోవాలి. ఒకసారి నిర్ణయం తీసుకున్నాక, దాన్ని సరైనదిగా మార్చుకునేందుకు ప్రయత్నించాలి.

తెలివిగా పెట్టుబడులు..

ఒకే చోట పెట్టుబడులు పెట్టడం వల్ల డబ్బు సంపాదించే అవకాశాలను కోల్పోతాం. అందుకే, వైవిధ్యానికి పెద్దపీట వేయాలి. ఎన్నో రంగాల్లో విస్తరించిన టాటా గ్రూపు ఇందుకు ఉదాహరణ. మన పెట్టుబడులు అనేక పథకాల్లో ఉండేలా చూసుకోవాలి. ఇందులో కొన్నింటిలో నష్టభయం ఉండొచ్చు. కొన్ని సురక్షితంగా కనిపిస్తాయి. వీటన్నింటినీ సమన్వయం చేసుకుంటూ సాగినప్పుడే ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోగలం.

క్రమానుగత పెట్టుబడి విధానం(సిప్)లో మదుపు చేస్తున్న వారి సంఖ్య ప్రతి నెలా పెరుగుతోంది. మార్కెట్లోకి ప్రవేశించాలనుకుంటే వారిలో చాలామంది యువతే ఉంటున్నారని ఇటీవలి నివేదికలూ చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఈక్విటీ పెట్టుబడులు పెట్టేవారు అనుసరించాల్సిన వ్యూహాలు తెలుసుకుందాం.



ఇవీ ముఖ్యమే...

- మార్కెట్ హెచ్చుతగ్గుల సమయంలో క్రమశిక్షణతో ఉండాలి. ఫండ్లను ఎంపిక చేసుకునేటప్పుడు కేవలం స్వల్పకాలిక రాబడిపైనే దృష్టి పెట్టొద్దు.
- ఇటీవలి కాలంలో మంచి పనితీరు చూపిస్తే, దానినే ఆ ఫండ్ను ఎంపికచేయడానికి ప్రామాణికంగా చూడొద్దు.
- దశల వారీగా పెట్టుబడులు కొనసాగించండి. మార్కెట్ పడిపోతున్నప్పుడూ పెట్టుబడులు కొనసాగాలి. క్రమం తప్పకుండా పెట్టుబడులు పెట్టడంపైనే దృష్టి సారించండి.
- ప్రారంభంలోనే ఒకే రంగానికి పరిమితమయ్యే సెక్టోరియల్ ఫండ్లపై ఎక్కువగా దృష్టి పెట్టొద్దు.
- మార్కెట్లో అస్థిరతకు సిద్ధంగా ఉండాలి. సూచీల్లో 10-20 శాతం క్షీణత సర్వసాధారణం. ఇప్పుడు మార్కెట్లోకి వస్తున్న మదుపరులు 30 శాతం తగ్గినా ఇబ్బంది లేదు అనే ధోరణితో ఉండాలి.

సిరి

కొత్తగా సిప్ చేస్తుంటే

స్టాక్ మార్కెట్ సూచీలు గరిష్ఠ స్థాయుల్లో కొనసాగుతున్నాయి. ఇలాంటప్పుడు పెట్టుబడులు కొంచెం నష్టభయంతో కూడుకున్నవే. అయినప్పటికీ.. సిప్ ద్వారా మార్కెట్లో ఉన్న అవకాశాలను అందుకునేందుకు వీలుంది.

నిధిని సృష్టించండి: అత్యవసర పరిస్థితుల్లో దీర్ఘకాలిక పెట్టుబడుల నుంచి డబ్బును తీయకుండా ఉండాలి. ఇందు కోసం కనీసం ఆరు నెలల ఖర్చులకు సరిపోయే మొత్తం మీకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. ఇందుకోసం లిక్విడ్ ఫండ్లలో సిప్ చేయొచ్చు.

మధ్యస్థ కాలానికి: చాలామంది యువ పెట్టుబడిదారులకు కొన్ని మధ్యస్థ కాల లక్ష్యాలు ఉంటాయి. ఇలాంటి అవసరాల కోసం విడిగా మదుపు చేయాలి. ఉదాహరణకు కారు కొనాలని అనుకోవచ్చు. లేదా ఇంటి కోసం ముందస్తు చెల్లింపు కావచ్చు. ఇలాంటి వాటన్నింటికీ ప్రత్యేకంగా ఒక సిప్ను ప్రారంభించాలి. స్వల్పకాలిక డెట్ ఫండ్లను ఇందుకోసం ఎంపిక చేసుకోవచ్చు.

దీర్ఘకాలిక లక్ష్యంతో: మీరు సాధించాల్సిన లక్ష్యం 15-20 ఏళ్ల, అంతకు మించి ఉంటే.. దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టాలి. పిల్లల ఉన్నత చదువులు, మీ పదవీ విరమణ లాంటివి ఇందుకు ఉదాహరణ. ఇందుకోసం నష్టభయాన్ని భరించే సామర్థ్యం ఆధారంగా 80-90 శాతం వరకూ ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలో మదుపు ప్రారంభించాలి.

కొత్తగా మార్కెట్లోకి ప్రవేశించే వారు నిఫ్టీ లేదా సెన్సెక్స్ సూచీ ఆధారంగా పనిచేసే లార్జ్ క్యాప్ ఫండ్లను పరిశీలించాలి. ఈక్విటీ అంటేనే అస్థిరతకు మారుపేరు. వీటికి మానసికంగా అలవాటు కావాలి. ఇందుకోసం కనీసం రెండు మూడేళ్ల సమయం పడుతుంది. ఆ తర్వాతే నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ వంటి వాటికి కొంచెం ఎక్కువ మొత్తంలో పెట్టుబడిని కేటాయించాలి.

పెట్టుబడుల్లో కాస్త అనుభవం వచ్చాక దీర్ఘకాలిక పోర్ట్ఫోలియోను సిద్ధం చేసుకోవాలి. ఇందులో 70-80 శాతం వరకూ నిఫ్టీ ఇండెక్స్ ఫండ్, వాల్యూ ఫండ్, లో వోలటిలిటీ ఫండ్లవంటివి ఉండాలి. ఆ తర్వాత.. అధిక రాబడి కోసం ప్రయత్నించాలి. స్మాల్, మిడ్ క్యాప్ ఫండ్లలో అస్థిరత అధికంగా ఉంటుంది. అదే సమయంలో లాభాలకూ అవకాశం ఉంటుంది. అనుభవం వచ్చాకే వీటిపై దృష్టి పెట్టాలి.

వైవిధ్యంగానూ: కేవలం ఈక్విటీల్లోనే పెట్టుబడులు పెట్టడం మంచిది కాదు. డెట్, బంగారం, ఇతర పథకాలనూ పరిశీలించాలి. పెట్టుబడుల్లో కనీసం 20 శాతం వరకూ వీటికి కేటాయించాలి. అప్పుడే పోర్ట్ఫోలియో స్థిరంగా ఉంటుంది.

షేర్ల విలువ తగ్గినప్పుడు...

స్టాక్ మార్కెట్లో కొన్ని సందర్భాల్లో మంచి కంపెనీల షేర్లు తక్కువ ధరకు లభిస్తుంటాయి. ఇలాంటి వాటిల్లో మదుపు చేసినప్పుడు దీర్ఘకాలంలో మంచి లాభాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది. ఇలాంటి వ్యూహంతోనే యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ నుంచి ఒక కొత్త పథకం అందుబాటులోకి వచ్చింది. యాక్సిస్ నిఫ్టీ 500 వాల్యూ 50 ఇండెక్స్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 18 వరకూ అందుబాటులో ఉండనుంది. కనీస పెట్టుబడి రూ.100. ఈ ఓపెన్ ఎండెడ్ పథకం ఇండెక్స్ ఫండ్స్ రకానికి చెందింది. నిఫ్టీ 500 వాల్యూ 50 టీఆర్ఐ సూచీ ప్రామాణికంగా పనిచేస్తుంది. నిఫ్టీ 500లో వాస్తవిక ధరకన్నా తక్కువ ధరకు లభిస్తున్న కంపెనీలను ఎంచుకొని, పోర్ట్ఫోలియోను నిర్మిస్తుంది. దీర్ఘకాలం పాటు మదుపు చేయాలనుకునే మదుపరులకు ఈ పథకం అనుకూలమని చెప్పొచ్చు.

వేచి చూసే వ్యవధి తక్కువగా

ఆరోగ్య బీమా పాలసీ తీసుకున్నప్పుడు ముందస్తు వ్యాధుల చికిత్సకు సాధారణంగా 36 నెలల పాటు వేచి ఉండే వ్యవధి ఉంటుంది. దీనికి భిన్నంగా పాలసీ తీసుకున్న 31 రోజు నుంచే ఇలాంటి వ్యాధుల చికిత్సకు పరిహారం అందించేలా మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ 'సర్వ' పేరుతో సరికొత్త పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీలో ప్రధానంగా మూడు ఆప్షన్లు ఉన్నాయి. సర్వ ప్రథమ్‌లో క్యాన్సర్, గుండె జబ్బులు ఇతరత్రా వ్యాధుల చికిత్సకు సంబంధించి రూ.3 కోట్ల వరకూ బీమాను తీసుకోవచ్చు. మధుమేహం, అధిక రక్తపోటు, ఆస్తమా, ఊబకాయం వంటి ముందస్తు వ్యాధుల చికిత్సకూ 31 రోజుల తర్వాత పరిహారం లభిస్తుంది. సర్వ ఉత్తమ్‌లోనూ సారథి అనే ఆప్షన్ కింద 31 రోజు నుంచి ముందస్తు వ్యాధుల చికిత్సకు పరిహారం అందుతుంది. ఇక సర్వ పరమ్‌లో ఎలాంటి వేచి ఉండే వ్యవధీ లేదు. ఇందులో 'గుల్లక్ అడ్వాంటేజ్' ఆప్షన్‌లో క్లెయిములతో సంబంధం లేకుండా ఏటా 100 శాతం వరకూ పాలసీ విలువ పెరుగుతుంది. ఇలా గరిష్ఠంగా 10 రెట్ల వరకూ పాలసీ విలువ అధికం అవుతుంది. వీటన్నింటిలోనూ ఆసుపత్రిలో చేరే 90 రోజుల ముందు, ఇంటికి వచ్చాక 180 రోజుల వరకూ అయ్యే ఖర్చులు చెల్లించేలా ఏర్పాటు ఉంది. రూ.3 కోట్ల వరకూ వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీని అందిస్తాయి. గడువు ముగియడానికి 30 రోజుల ముందే పాలసీని పునరుద్ధరిస్తే ప్రీమియంపై 2.5 శాతం వరకూ రాయితీ లభిస్తుంది. ఇద్దరు లేదా అంతకు మించి కుటుంబ సభ్యులకు కలిసి ఒకే పాలసీని తీసుకుంటే 10 శాతం వరకూ 'ఫ్యామిలీ డిస్కౌంట్' అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది.

కొత్త పథకం

జీవితాంతం పింఛను అందేలా

పదవీ విరమణ అనంతరం జీవితాంతం వరకూ పింఛను అందించే డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్‌ను రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిపేరు రిలయన్స్ నిప్పాన్ లైఫ్ నిశ్చిత్ పెన్షన్. ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం 2041 నాటికి దేశ జనాభాలో 15.9 శాతం మంది 60 ఏళ్లకు పైబడిన వారే ఉంటారు. ఈ నేపథ్యంలో పింఛను పథకాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా చిన్న కుటుంబాలు పెరుగుతున్నందున ఆర్థికంగా ఎవరి మీదా ఆధారపడాల్సిన అవసరం లేకుండా డిఫర్డ్ యాన్యుటీ పథకాలు తోడ్పడతాయని సంస్థ పేర్కొంది. ఈ పాలసీలో జీవితాంతం వరకూ పింఛను వచ్చేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఆ తర్వాత జీవిత భాగస్వామి, పిల్లలకు, తోబుట్టువులకూ పింఛను అందే ఏర్పాటు చేయొచ్చు. 5 నుంచి 10 ఏళ్ల వరకూ పాలసీకి ప్రీమియం చెల్లించే ఏర్పాటు ఉంది. ఏదైనా అనుకోని అనారోగ్యం, వైకల్యం సంభవించినప్పుడు డబ్బును వెనక్కి తీసుకునే వీలుంది.



రతన్‌టాటా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భాజపా రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్

రతన్‌టాటాను కోల్పోవడం బాధాకరం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పారిశ్రామిక దిగ్గజమైన రతన్‌టాటాను కోల్పోవడం పట్ల భాజపా రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పట్టణంలోని పాత మద్రాసు పాత బస్టాండు కూడలిలో రతన్‌టాటా చిత్రపటానికి గురువారం నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో భాజపా నేతలు సుబ్రహ్మణ్యంరెడ్డి, రమేష్‌బాబు, ఢిల్లీకుమార్, రవి ఆచారి, పోలయ్య, భరత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం నాయకులు

కబ్జా చేయాలని చూస్తే సహించేది లేదు

రేణిగుంట : కుల సంఘాల పేరుతో భవనాలు నిర్మించి.. ప్రభుత్వ భూములు కబ్జా చేయాలని యత్నిస్తే సహించేది లేదని తారకరామానగర్‌కు చెందిన ఎస్సీ సంఘాల నాయకులు తెలిపారు. గురువారం తారకరామానగర్‌లో వారు మాట్లాడుతూ.. తమ ప్రాంతానికి చెందిన కొందరు కమ్యూనిటీ భవనాల పేరుతో ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే అడ్డుకున్నామన్నారు. తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి బుజ్జినాయుడు మాట్లాడుతూ.. వామపక్ష పార్టీలోని ఓ నాయకుడు స్థలాలను ఆక్రమించం దారుణమన్నారు.

అందుబాటులో హెల్ప్‌లైన్ కేంద్రాలు



అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస నాయక్

శ్రీకాళహస్తి: న్యాయ సేవలతో పాటు సలహాలు, సూచనల కోసం హెల్ప్‌లైన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసనాయక్ అన్నారు. ఈ విషయమై ఎవరైనా న్యాయ సాయం పొందేందుకు 15100 నంబరుకు డయల్ చేసి సేవలను పొందవచ్చునని తెలిపారు. రైల్వే స్టేషన్, బస్టాండు, ట్యాక్సీ స్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, తహసీల్దార్, ఎంపీడీవో, తపాలా తదితర ప్రాంతాల్లో సూచికలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన తీసుకురావాలని కోరారు.

సమష్టి కృషితో సభ్యత్వ నమోదు

శ్రీకాళహస్తి: భాజపా సభ్యత్వ నమోదు విషయంలో శ్రీకాళహస్తి రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉండటం ఎంతో ఆనందంగా ఉందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కృష్ణదాస్ అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో సభ్యత్వ నమోదును గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్పతో కలిసి పరిశీలించారు. రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ నేతృత్వంలో కరపత్రాలు ఆవిష్కరించారు.

శిల్పారామంలో కూచిపూడి ప్రదర్శన

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో దసరా వేడుకల్లో భాగంగా నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. గురువారం తిరుపతి చెందిన అర్ధనారీశ్వర బృందం కళాకారుల ప్రదర్శన, కళాకారుల నృత్యాలు సందర్శకులను అబ్బురపరిచాయి. ఏవో ఖాదరవల్లి తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టి.. కాసులు కూడబెట్టి

చోద్యం చూస్తున్న అధికారులు

రేణిగుంట, న్యూస్‌టుడే: చెరువుమట్టిని తీసి ప్రైవేటు వెంచర్లకు విక్రయించి కాసులు కూడబెడుతున్నారు. ప్రభుత్వం మారినా సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదు. అక్రమ సంపాదనపైనే పూర్తి స్థాయి దృష్టి సారించిన కొందరు ఈతరహా వ్యవహారాలను కొనసాగిస్తున్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా పట్టించుకుంటున్న పాపాన పోవడం లేదు. రేణిగుంట మండలంలోని పలు చెరువుల్లో ఇదే పరిస్థితి నెలకొంది.



చెరువుల్లో మట్టి తవ్వుతున్న దృశ్యం

తరలింపు దందా

రేణిగుంట మండలంలోని పలు చెరువుల్లో మట్టి తరలింపు దందా కొనసాగుతోంది. ఎక్కడో ప్రైవేట్ వ్యక్తులు వేస్తున్న వెంచర్లకు ఇక్కడ నుంచి మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందులో ఆ పార్టీ, ఈ పార్టీ నాయకులు అంటూ తేడా లేకుండా పోయింది. ఎక్కడ చూసినా ఈ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నా ఎవరూ పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ఇటీవల కరకంబాడి సమీపంలోని మల్లెమడుగు రిజర్వాయిర్ వెనుక ఉన్న గుట్టను చదునుచేసి విక్రయించారు. అది మరచిపోయేలోపు ఇప్పుడు చెరువులపై పడ్డారు. కరకంబాడి చెరువులోని మట్టిని కొంతభాగం తరలించి సొమ్ము చేసుకున్నారు. మరో పక్క కుర్రకాలువ చెరువులో వందల సంఖ్యలో ట్రాక్టర్ల మట్టి తరలిస్తున్నారు. పక్కనే ఉన్న ఒక వెంచర్‌కు దీన్ని తరలిస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

ఈ అంశంపై కొన్ని చెరువులను గుర్తించి ఎంపీడీవోకు పంపాం. పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో వాటిని సంరక్షించాలని కోరాం. మట్టి తరలింపుపై చర్యలు తీసుకుంటాం.

- శ్యామ్, ఇన్‌ఛార్జి తహసీల్దార్

స్పందించని అధికారులు

స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదని ప్రజలు వాపోతున్నారు. పలు ప్రైవేట్ వెంచర్లకు ఇలా మట్టిని తరలించి చెరువుల రూపురేఖలను మార్చేస్తున్నారు. చెరువుల్లో తవ్వకాల కారణంగా నీరు చేరిన గుంతలు ప్రమాదకరంగా మారనున్నాయి. ఇరిగేషన్ అధికారులు అసలు మండలంలో పని చేస్తున్న దాఖలాలు కనిపించడంలేదు. ఇప్పటికైనా చెరువులను కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శ్రీకాళహస్తి(గ్రామీణం)(ఏర్పేడు) : శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి సమీపంలోని డీఈడీ పూర్వ విద్యార్థులు గురువారం సమావేశమయ్యారు. 2012-14లో ఉపాధ్యాయ విద్యనభ్యసించిన ఛాత్రోపాధ్యాయులు పదేళ్ల తర్వాత కళాశాలలో సమ్మేళనమై అప్పటి అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. విద్యార్థి దశలోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడటంతో అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మిద్దె లహరి, శ్రీకుమార్, సత్యనారాయణరావు, అన్వర్‌ఖాన్, చంద్రశేఖర్, గీతాదేవి పాల్గొన్నారు.

సింహవాహినీ..
బండాసుర సంహారిణీ

లోకకంతకుడైన బండాసురుడ్ని సంహరించేందుకు ఆదిశక్తిగా అవతరించిన జ్ఞానాంబికకు విశేష పూజలు జరిపారు. శ్రీదేవీ నవరాత్రి వార్షిక ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి బండాసుర సంహారం ఉత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టారు. ఆలయ అలంకార మండపం నుంచి ఉత్సవమూర్తిని బాలజ్ఞానాంబిక ఆలయానికి తీసుకువచ్చి ధూప, దీప, నివేదనలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో లోకేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం, తనిఖీ అధికారి హరియాదవ్ పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి



బండాసురుడ్ని సంహరిస్తున్న జ్ఞానాంబిక



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

పల్లె పండుగ విజయవంతం చేయాలి

ఏర్పేడు, న్యూస్‌టుడే: ప్రజల భాగస్వామ్యంతో పల్లెపండుగను విజయవంతం చేయాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. ఏర్పేడు మండలంలోని ఆమందూరు పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం పరిశీలించారు. ఈ నెల 14 నుంచి వారంరోజుల పాటు జరిగే పల్లెపండుగ వారోత్సవాల్లో విధిగా అభివృద్ధి కార్యక్రమాలు గురించి తెలియజేస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. చంద్రశేఖర్‌రాజు, దేవరి, బాలాజిరావు, పట్టాభిరెడ్డి, మునెయ్య పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలి

శ్రీకాళహస్తి : నిర్మాణం పూర్తయిన టిడ్కో ఇళ్లను పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వినుత దంపతులు టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌కు విన్నవించారు. తిరుపతికి వచ్చిన ఆయన్ను గురువారం కలిశారు. ఇళ్లు లేకుండా పేదలు పడుతున్న కష్టాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వీలైనంత త్వరలో సమస్యను పరిష్కరించాలని ఆయనను కోరారు. పలువురు జనసేన నేతలు పాల్గొన్నారు.

గ్రంథ ప్రచురణకు విరాళం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: బీమా ఏజెంట్ దొరస్వామి ప్రచురించనున్న శ్రీజ్ఞానాంమృతం గ్రంథం ప్రచురణకు ఆయనతో పాటు విద్యనభ్యసించిన డిగ్రీ విద్యార్థులు రూ.54 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు నగదును గురువారం దొరస్వామికి అందజేశారు. రూ.7.5 లక్షల వ్యయంతో గ్రంథం ప్రచురణకు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. కార్తీక మాసంలో దీన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి దుర్మరణం

తొట్టంబేడు: తెలుగుగంగ కాలువపై ప్రయాణిస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటన మండలంలోని కొన్నలి సమీపంలోని పొలాల్లో బుధవారం జరిగింది. ఎస్సై ఈశ్వరయ్య వివరాల మేరకు.. కొన్నలి ఎస్సీ కాలనీకి చెందిన నలుగురు రైతులు వరి విత్తనాలు కొనుగోలుకు ట్రాక్టర్‌పై తెలుగుగంగ కాలువ మీదుగా శ్రీకాళహస్తి బయలుదేరారు. ఈ క్రమంలో అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పెళ్లకూరు మండలంలోని పునబాక ఎస్సీ కాలనీకి చెందిన సోమశేఖర్(33) గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నాగలాపురం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీరకుప్పం వాసి మురుగయ్య(54) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మండలంలోని బీరకుప్పానికి చెందిన మురుగయ్య గత శనివారం సమీప తమిళనాడులోని ఊతుకోట వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొంది. చెన్నై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం

సత్యవేడు, న్యూస్‌టుడే: మండలంలోని రాజగోపాలపురం పంచాయతీ బాలగోపాలపురం వద్ద గుర్తుతెలియని మృతదేహం తెలుగుగంగ కాలువలో కొట్టుకుపోతోందని గ్రామస్థులు గురువారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రామస్వామిని వివరణ కోరగా.. గంగ కాలువలో మృతదేహం కొట్టుకుపోతోందన్న సమాచారం అందిందని, శుక్రవారం ప్రత్యేక టీంతో మృతదేహాన్ని వెలికి తీస్తామన్నారు

గంజాయి పట్టివేత.. ఐదుగురి అరెస్ట్

రేణిగుంట, న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురిని గాజులమండ్యం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. గురువారం వారపు సంత గేటు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానంగా సంచరిస్తున్న వ్యక్తులను తనిఖీ చేయగా 950 గ్రాముల గంజాయి లభ్యమైందన్నారు. తమిళనాడుకు చెందిన భార్యాభర్తలు ఏలుమలై, ఈశ్వరి, వారి అనుచరులు రాజేంద్రకుమార్, కరణ్‌రాజ్, మదనకుమార్‌ను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరికి జీవిత కారాగార శిక్ష

ఏర్పేడు, న్యూస్‌టుడే: హత్య కేసులో ఇద్దరు నిందితులకు శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయస్థానం గురువారం జీవిత కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించింది. ఏర్పేడు సీఐ జయచంద్ర వివరాల మేరకు.. మండలంలోని మర్రిమందకి చెందిన మునస్వామి(45)కి అదే గ్రామానికి చెందిన తంబి కుమారస్వామి, తంబి నేపాల్ మధ్య భూవివాదం ఉంది. ఈ క్రమంలో 2019 ఫిబ్రవరి 18న మునస్వామి హత్యకు గురయ్యారు. అప్పట్లో కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపారు. దీనిపై న్యాయస్థానంలో విచారణ జరపడంతో తంబి కుమారస్వామి, నేపాల్‌కు జీవిత కారాగారశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ తీర్పు ఇవ్వడంతో నిందితులను శ్రీకాళహస్తి జైలుకు పంపినట్లు సీఐ వివరించారు.

ఆటో ద్విచక్ర వాహనం ఢీ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని రామసేతు వంతెన సమీపంలోని సన్నిధివీధి రోడ్డులో ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రయాణికులతో వెళ్తున్న ఆటో, ద్విచక్రవాహనం బుధవారం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహన చోదకుడు బాబ్‌జాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం ఆటో డ్రైవర్ వేణుగోపాల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే సహించం.. తొట్టంబేడు : ఇసుక అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమని శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. గురువారం పెన్నలపాడు, మోదుగులపాలెం గ్రామాల్లో స్వర్ణముఖినదీ పరిసరాలను పరిశీలించారు. వ్యాపార నిమిత్తం ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవన్నారు.

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు



మొదటి రకం: కేజీ రూ. **40** నుంచి రూ. **50** వరకు
రెండో రకం: కిలో రూ. **30** నుంచి రూ. **40** వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	134
లేయర్	115
బ్రాయిలర్స్	240
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	195

రతన్ టాటాకు నివాళి

వెంకటగిరి, న్యూస్‌టుడే: ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా మృతి దేశానికి తీరనిలోటని న్యాయవాది గాంధీ అన్నారు. కాశీపేట కూడలిలో గురువారం రాత్రి వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: శ్రీనివాసపురం గిరిజనులకు గురువారం అమ్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. 80 కుటుంబాల మహిళలకు చీరలు, చిన్నారులకు దుస్తులు ఇచ్చారు. ఫౌండేషన్ నిర్వాహకులు కృష్ణవేణి, ఉపాధ్యాయులు ప్రసాద్ పాల్గొన్నారు.

శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఐదో వార్డుకు చెందిన అంజనమ్మకు శ్రీకృష్ణదేవరాయ, కాపు బలిజ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. గురువారం రాత్రి ట్రస్ట్ కార్యాలయంలో ఈమెకు నగదు అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు తోట కృష్ణయ్య మాట్లాడుతూ మహిళకు శస్త్రచికిత్స కోసం ఈ నగదును అందించామన్నారు. వెంకటేశ్వరరావు, తిరుపాల్, తులసీదాస్, రవీంద్ర, హరిప్రసాద్, రాజేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు అంతరాయాలకు చెక్

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలో విద్యుత్తు అంతరాయాలు జరగకుండా చర్యలు చేపట్టామని డిస్కం డీఈఈ శేఖర్ పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని 33కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో గురువారం కొత్తగా వ్యాకూమ్ సర్క్యూట్ బ్రేకర్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఏఈ మురళీ, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతికత సద్వినియోగం చేసుకోవాలి

వెంకటగిరి, న్యూస్‌టుడే: రైతులు శాస్త్ర సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ శిక్షకులు, సమన్వయకర్త భాస్కరయ్య అన్నారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం రైతులు, ఉద్యాన సహాయకులు, ఎంపీఈవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేవీకే అధిపతి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖ ఏడీ నాగార్జున సాగర్, ప్రకృతి వ్యవసాయ అధికారి ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాలచ్చూరు కాలువ ఆధునికీకరణ అంతేనా?

❖ బిల్లులు రాక.. పనులు కాక ❖ గతేడాది దెబ్బతిన్న చోట్ల మరమ్మతులేవీ?



కేజీకండ్రిగ వద్ద పంట కాలువలో పిచ్చిమొక్కలు

గూడూరు, పెళ్లకూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో మంజూరైన పాలచ్చూరు ఆనకట్ట సిస్టం కాలువ ఆధునికీకరణ పనులు అటకెక్కాయి. మూడు మండలాల్లో సాగు, తాగునీటిని అందించే ఈ కాలువ లైనింగ్, మినీ వంతెనల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు మధ్యలో పనులు ఆపేశారు. దీంతో సగం పైగా కాలువ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.

గూడూరు ఇరిగేషన్ డివిజన్‌లోని పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి మండలాల గుండా 23 కి.మీ ప్రవహించే కాలువ పనులకు 2019లో రూ.31.35 కోట్ల నిధులు విడుదలయ్యాయి. 2020లో గుత్తేదారు పనులు మొదలు పెట్టి సుమారుగా 10 కి.మీ మేర కాంక్రీట్ లైనింగ్, రెండు మినీ వంతెనలు పూర్తి చేశారు. ఇంకా సుమారుగా 13 కి.మీ మేర లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. కాలువల్లో వ్యర్థాలు పేరుకొని నీరు కదిలే పరిస్థితి లేదు. గతేడాది వరదల సమయంలో ఎక్కడికక్కడ కాలువ పూడిపోయింది.

పెరిగిన అంచనాలు

సుమారుగా రూ.6 కోట్ల మేర బిల్లులు రావాల్సి ఉంది. పెళ్లకూరు, నాయుడుపేట మండలాల్లో పాక్షికంగా పనులు చేపట్టారు. ఓజిలిలో అసలు పనులే మొదలు పెట్టలేదు. గుత్తేదారు గడవు కూడా తీరిపోవడంతో పనులు ఎలా చేపడతారో తెలియని పరిస్థితి. అంచనాలు పెరిగినట్లు సమాచారం. గుత్తేదారులకు బిల్లులు ఇవ్వడంతోపాటు వారికి తిరిగి పనులు అప్పగించి చేపట్టాల్సి ఉందని రైతులు కోరుతున్నారు.



కలవకూరు వద్ద దెబ్బతిన్న మినీ వంతెన

కూటమి ప్రభుత్వంపై ఆశలు

రైతాంగం మీద దృష్టి పెడుతున్న కూటమి ప్రభుత్వంపై రైతులు ఆశతో ఉన్నారు. ఈ కాలువ ఆధునికీకరణ చేపట్టాలని కోరుతున్నారు. గతేడాది వరదల వల్ల దెబ్బతిన్న కాలువ పనులు శాశ్వతంగా చేపట్టాల్సి ఉన్నా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. కప్పుగుంటకండ్రిగ వద్ద రెండు మూడు చోట్ల బ్రీచెస్ పడ్డాయి. వాటిని రైతులే తాత్కాలికంగా గండ్లు పూడ్చారు. మళ్లీ చాలా చోట్ల కట్టలు దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

దొరవారిసత్రం, న్యూస్‌టుడే:

సమస్య: నెల్లూరుపల్లి నుంచి రామారెడ్డికండ్రిగకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. రహదారికి ఇరువైపులా కంపచెట్లు కమ్ముకుని ఉన్నాయి.

- ఎన్.వెంకటసురేంద్రరెడ్డి, నెల్లూరుపల్లి

సమాధానం: పరిశీలించి మరమ్మతు చేయిస్తాం. కంపచెట్లు తొలగిస్తాం. **- గోవర్ధన్, ఎంపీడీవో**

బాధ్యతల స్వీకరణ



వేణు

కోట, న్యూస్‌టుడే: కోట ఎంపీడీవోగా వై.వేణు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఈవోపీఆర్డీగా పని చేస్తూ ప్రస్తుతం ఎంపీడీవోగా నియమితులయ్యారు.

చిట్టమూరు(కోట): చిట్టమూరు ఎంపీడీవోగా మనోహర్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. **వాకాడు:** ఎంపీడీవోగా పీఎం అన్నపూర్ణారావు బాధ్యతలు చేపట్టారు.

సీఎస్‌డీటీగా గోపీనాథరెడ్డి


నాయుడుపేట: నాయుడుపేట పౌరసరఫరాలశాఖ ఉప తహసీల్దారుగా చిల్లకూరు గోపీనాథరెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ డీటీగా ఉన్న ఒబయ్యను మరోచోటకు బదిలీ చేశారు.

రోగులను పట్టించుకోని వైద్య సిబ్బంది



మాట్లాడుతున్న ఎంపీడీవో వినీల్ కుమార్, పక్కన ఎంపీపీ భాస్కరరెడ్డి తదితరులు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: వెంగమాంబాపురం సచివాలయ పరిధిలో వైద్య సిబ్బంది సరిగా ఉండరని.. రోగులనూ పట్టించుకోరని తెదేపా ఎంపీటీసీ సభ్యుడు చెముడుగుంట చంద్రమౌళి నిలదీశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ. అక్కసముద్రానికి తాగునీటి బోరు, శ్మశానానికి దారి కల్పించాలన్నారు. ఎంపీపీ భాస్కర్‌రెడ్డి ప్రసంగిస్తూ అసంపూర్తి సచివాలయ భవన నిర్మాణాలను పూర్తి చేయించాలని కోరారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మురళీరెడ్డి, చిలమనూరు ఎంపీటీసీ సభ్యుడు సురేంద్రరెడ్డి, పాకపూడి సర్పంచి గోపీకృష్ణారెడ్డి సభలోకి ఆలస్యంగా ప్రవేశించి కొద్దిసేపటికే నిష్క్రమించారు. తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో వినీల్ కుమార్, ఎంఈవో కిల్లా వెంకటేశ్వర్లు తదితరులు హాజరవగా ఉపాధి పథకం ఏపీవో, పలువురు సర్పంచులు డుమ్మా కొట్టారు. అనంతరం పంచాయతీలో ఇంటింటికి తడి చెత్త, పొడి చెత్త సేకరించేందుకు ప్లాస్టిక్ బుట్టలు అందించారు.



‘చెర’వాణి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: సెలవుల్లో విద్యార్థులు ఏం చేస్తారు.. ఆటపాటలతో సందడిగా గడుపుతారు. మరికొందరు కంప్యూటర్, ఇతర విజ్ఞానపరమైన కోర్సులు నేర్చుకుంటారు. మేనకూరు పారిశ్రామికవాడలో మాత్రం దసరా సెలవులకు ఇళ్లకు చేరుకున్న విద్యార్థులు గోడలపై చేరి చరవాణుల్లో నిమగ్నమయ్యారు. చరవాణి ఎంతమేర యువతను ఆకర్షిస్తూ.. వారి భవితకు అవరోధంగా మారుతోందో చెప్పేందుకు నిదర్శనమే ఈ చిత్రం.

‘కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి’

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించిందని, గత వైకాపా పాలనలో గ్రామీణ ప్రాంతాలను పట్టించుకోకుండా నిర్వీర్యం చేశారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించే పల్లె పండుగ వారోత్సవాలపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. నాయకులు వెంకటేశ్వర్లురాజు, కిషోర్‌నాయుడు, వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

నిర్ణీత ధరకు సరకులు విక్రయించాలి

నాయుడుపేట, న్యూస్‌టుడే: నిత్యావసరాలను నిర్ణీత ధరలకు విక్రయించాలని తహసీల్దారు గీతావాణి దుకాణదారులకు చెప్పారు. గురువారం నాయుడుపేట పట్టణంలో షాపింగ్ మాల్స్‌ను సందర్శించి ధరల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధరల బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. సీఎస్ డీటీ గోపీనాథ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలో లోతువానిగుంటలో ఉన్న వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయంలో గురువారం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు నైపుణ్యతపై ఉన్నతధికారులు శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రానికి చెందిన సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీదేవి, వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

డీజేలు ఏర్పాటు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ రమణకుమార్, పోలీసులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: దసరా పురస్కరించుకుని గూడూరు పట్టణం, డివిజన్ పరిధిలో కలశాల ఊరేగింపులో డీజేలు ఏర్పాటు చేస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రమణకుమార్ హెచ్చరించారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో గురువారం పట్టణ సీఐ శేఖర్‌బాబుతో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. నిబంధనల మేరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రెండో పట్టణ ఎస్సై సుబ్రహ్మణ్యంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



టిష్యూ కల్చర్ అరటి సాగుపై దృష్టి

వెంకటగిరి, న్యూస్‌టుడే: రైతులు టిష్యూ కల్చర్ అరటి సాగుపై దృష్టి పెట్టాలని కేవీకే అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి సూచించారు. కేవీకే ఆధ్వర్యంలో గురువారం రైతులకు అరటి సాగుపై అవగాహన కల్పించారు. రైతులకు అరటి పిలకలు అందించారు. శాస్త్రవేత్తలు తిరుపాల్, రాజీవన తదితరులు పాల్గొన్నారు.

← రైతులకు అరటి పిలకలు అందిస్తున్న కేవీకే అధిపతి శ్రీనివాసరెడ్డి

జలాశయాల నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితం

దశాబ్దాలుగా సాగునీటికి అన్నదాతల అవస్థలు

కోట, న్యూస్‌టుడే: మూడు దశాబ్దాలుగా చెరువులను రిజర్వాయరు చేయాలనే లక్ష్యం ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. దీంతో వేలాది ఎకరాల ఆయకట్టు రైతులు సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రబీ, ఖరీఫ్ సీజన్లలో అవసరం మేరకు సాగునీరు చెరువుల్లో నిల్వ లేకపోవడంతో చివరి దశలోని పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తూనే ఉన్నారు. అయినా అన్నదాతల కల సాకారం కాలేదు.



నెల్లూరుపల్లిలోని పెన్నక్క చెరువు

❖ గూడూరు నియోజకవర్గంలోని కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం పెన్నక్క చెరువు, చిట్టమూరు మండలంలోని యల్లసిరి చెరువులు వేలాది ఎకరాలకు సాగు నీరు అందించే పెద్ద చెరువులు. పెన్నక్కచెరువు ద్వారా కోట మండలం నెల్లూరుపల్లి, వీపీ అగ్రహారం, జరుగుమల్లి, చిట్టేడు, చిల్లకూరు మండలంలోని పలు గ్రామాల్లో 3,500 ఎకరాలపైగా సాగునీరు అందుతుంది.

❖ చిట్టమూరు మండలం యల్లసిరి చెరువు ద్వారా 16 గ్రామాల్లోని చెరువులకు సాగునీరు వెళ్తుంది. 3 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతుంది. వర్షాలు వస్తే చెరువులు నిండినా వృథాగా సాగునీరు పోతోంది. నీటిని అవసరాల మేరకు నిల్వ ఉంచుకొని వినియోగించుకోనే అవకాశం లేకుండా పోయింది. ఈ క్రమంలోనే మూడు దశాబ్దాల కిందట రెండు చెరువులను రిజర్వాయర్లు చేసి నీటిని అవసరం మేరకు విడుదల చేయాలని అప్పటి మంత్రులు, నేతల అధికారులు ప్రతిపాదనలు ద్వారా పంపారు. అయితే అవి అప్పటి నుంచి కాగితాలకే పరిమితమయ్యాయి.

❖ ఏఈ మునిరత్నంను వివరణ కోరగా.. పెన్నక్కచెరువు జలాశయం ప్రతిపాదనను మళ్లీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. యల్లసిరి చెరువు ప్రతిపాదనలకు ఆమోదం పొందేటట్లు చూస్తామని అధికారులు తెలిపారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్జీవో కాలనీలో నిర్మించిన అక్రమ నిర్మాణం గురువారం కూల్చివేశారు. ఇక్కడ ప్రజా ప్రయోజనాల కోసం వదిలిన ఖాళీ స్థలంలో స్థానికులు కొందరు ఆలయ నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణాలపై అభ్యంతరం తెలపడంతో పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పర్యవేక్షించి, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయడం సరికాదన్నారు. దాంతో గురువారం ఉదయం అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించారు.

అందుబాటులో హెల్ప్‌లైన్ కేంద్రాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: న్యాయసేవలతో పాటు సలహాలు, సూచనల కోసం హెల్ప్‌లైన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసనాయక్ అన్నారు. ఈ విషయమై ఎవరైనా న్యాయ సాయం పొందేందుకు 15100 నంబరుకు డయల్ చేసి సేవలను పొందవచ్చునని తెలిపారు. రైల్వేస్టేషన్, బస్టాండు, టాక్సీ స్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, తహసీల్దార్, ఎంపీడీవో, తపాలా తదితర ప్రాంతాల్లో సూచికలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన తీసుకురావాలని కోరారు.

మండపాలు పూర్తి చేయాలి

శ్రీకాళహస్తి: కైలాసగిరి ప్రదక్షిణ మార్గంలో అసంపూర్తిగా ఉన్న విడిది మండపాలను సత్వరం పూర్తి చేయాలని ఆలయ ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కోరారు. ఆయన అసంపూర్తిగా ఉన్న మండపాలను పరిశీలించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో చంద్రశేఖర్ ఆజాద్ మండపాలు పూర్తి చేయించాలని కోరారు.

మినీ లారీ ఢీకొని వ్యక్తి మృతి

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు మండలం చిల్లకూరు వడ్డిపాళెం వద్ద ఎన్‌హెచ్ 71పై మినీ లారీని మరో లారీ ఢీకొన్న ఘటనలో మినీ లారీ డ్రైవర్ కోటా చక్రవర్తి(52) మరణించారు. నెల్లూరుకు చెందిన కోట చక్రవర్తి ప్లైవుడ్ తీసుకుని గురువారం నెల్లూరు నుంచి తిరుపతి వెళ్తున్నారు. చిల్లకూరు వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీ మినీ లారీని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ చక్రవర్తి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దసరా ఉత్సవాల్లో చిమ్మచీకట్లు



ఆలయం వద్ద ప్రధాన రహదారిలో వెలగని సెంట్రల్ లైటింగ్

తాజ్ పెట్రోల్ బంకు సమీపాన

చెంగాళమ్మ ఆలయం వద్ద భక్తుల అవస్థలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పట్టణంలోని ఒక్కో ప్రాంతం నుంచి సారె తీసుకెళ్లి, భక్తులు అమ్మవారికి సమర్పిస్తున్నారు. ఇది ఇలా ఉంటే... జీఎన్‌టీ రోడ్డులో తాజ్ పెట్రోల్ బంకు నుంచి ఆలయం వరకు గురువారం రాత్రి సెంట్రల్ లైటింగ్ వెలుగులు లేవు. చీకట్లోనే అమ్మవారికి సూళ్లూరు, నాగరాజాపురం, వాటంబేడు రోడ్డు తదితర ప్రాంతాల వారు సారె తీసుకెళ్లారు. రాత్రివేళ భక్తులు ఆలయం నుంచి వచ్చేందుకు కూడా చీకట్లో ఇబ్బందులు పడ్డారు.

ఇసుక ట్రాక్టర్ యజమానిపై కేసు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: చావలిలో స్థానికులు అప్పగించిన ట్రాక్టర్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానికులు పట్టుకుని పోలీసుకు అప్పగించిన విషయం విదితమే.

ప్రహరీ తొలగింపుపై..

తడ, న్యూస్‌టుడే: తడకండ్రిగలో రాజారావు, ఆదిలక్ష్మి దంపతులకు చెందిన ఇంటి స్థలం చుట్టూ ఉన్న ప్రహరీని కూల్చివేశారని బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జాన్ చిరంజీవులు, వరాల బాబు, హుస్సేన్‌బాయ్, తొండా మణి తదితరులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై కొండపనాయుడు గురువారం పేర్కొన్నారు.

సిరి

రతన్ టాటా చెప్పిన ఆర్థిక సూత్రాలు...

రతన్ టాటా గురించి ఆలోచించినప్పుడు మనకు గుర్తుకొచ్చేది ఏమిటి? వ్యాపార రంగంలో ప్రపంచానికి భారత శక్తిని చాటి చెప్పిన ఒక గొప్ప వ్యాపారవేత్త అనే కదా. దీన్ని సాధించే క్రమంలో ఆయన ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారు. త్యాగాలూ చేశారు. డబ్బును సంపాదించడం, దాన్ని నిర్వహించే విషయంలో ఆయన సూచనలు ఎప్పుడూ ఆచరణీయం. ఆయన చెప్పిన కొన్ని సూత్రాలేమిటంటే..



నైతికతతో...

అందరమూ డబ్బు సంపాదించాలనే చూస్తుంటాం. డబ్బును వెంబడించడం చాలా ముఖ్యం. కానీ, దాన్ని నైతికతతో చేయాలి. సంపాదన న్యాయంగా ఉన్నన్ని రోజులూ ఆర్థికంగా విజయం సాధిస్తూనే ఉంటాం. చెడు మార్గంలో, తొందరగా డబ్బును కూడబెట్టాలనుకుంటే మాత్రం పతనం ప్రారంభమవుతుంది.

ఇవ్వడం నేర్చుకోండి..

మనం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పుడే అన్నీ తిరిగి మనకు అందుతాయి. మంచి పనులు, డబ్బు ఏ రెండింటికీ ఇదే సూత్రం వర్తిస్తుంది. అవసరంలో ఉన్న వారిని మీరు ఆర్థికంగా ఆదుకోండి.. మీకు కావాలి అనుకున్నప్పుడు మీ రూపం లోనైనా, ఎవరి సంస్థనైనా సహాయం అందుతుంది. అది మీకు వృత్తిలోనూ, ఆర్థికంగానూ మేలు చేకూరుస్తుంది.

అవకాశాలు తీసుకోండి..

అన్నీ సజావుగానే సాగుతున్నాయి కదా అనే ధోరణి నుంచి బయటపడాలి. అప్పుడే మీరు డబ్బు విషయంలోనూ, వృత్తి, ఉద్యోగ జీవితంలోనూ వృద్ధి సాధిస్తారు. అవకాశాలను వదులుకోవద్దు. ధైర్యంగా, వేగంగా ఉండాలి. ప్రతి రోజూ మీ గురించి మీరు సమీక్షించుకోవడం ఎంతో అవసరం.

నిర్ణయాలను గౌరవించండి..

మీరు తీసుకునే నిర్ణయాలను విశ్వసించండి. మంచివా, చెడువా అనేది తర్వాత విషయం. ఒక నిర్ణయం తీసుకునే ముందే దాని గురించి పూర్తిగా విశ్లేషించుకోవాలి. ముఖ్యంగా డబ్బును పెట్టుబడి పెట్టేటప్పుడు. దాని ఫలితం ఎలా ఉంటుందో ముందే అంచనా వేసుకోవాలి. ఒకసారి నిర్ణయం తీసుకున్నాక, దాన్ని సరైనదిగా మార్చుకునేందుకు ప్రయత్నించాలి.

తెలివిగా పెట్టుబడులు..

ఒకే చోట పెట్టుబడులు పెట్టడం వల్ల డబ్బు సంపాదించే అవకాశాలను కోల్పోతాం. అందుకే, వైవిధ్యానికి పెద్దపీట వేయాలి. ఎన్నో రంగాల్లో విస్తరించిన టాటా గ్రూపు ఇందుకు ఉదాహరణ. మన పెట్టుబడులూ అనేక పథకాల్లో ఉండేలా చూసుకోవాలి. ఇందులో కొన్నింటిలో నష్టభయం ఉండొచ్చు. కొన్ని సురక్షితంగా కనిపిస్తాయి. వీటన్నింటినీ సమన్వయం చేసుకుంటూ సాగినప్పుడే ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోగలం.

క్రమానుగత పెట్టుబడి విధానం(సిప్)లో మదుపు చేస్తున్న వారి సంఖ్య ప్రతి నెలా పెరుగుతోంది. మార్కెట్లోకి ప్రవేశించాలనుకునే వారిలో చాలామంది యువతే ఉంటున్నారని ఇటీవలి నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఈక్విటీ పెట్టుబడులు పెట్టేవారు అనుసరించాల్సిన వ్యూహాలు తెలుసుకుందాం.



ఇవీ ముఖ్యమే...

- మార్కెట్ హెచ్చుతగ్గుల సమయంలో క్రమశిక్షణతో ఉండండి. ఫండ్లను ఎంపిక చేసుకునేటప్పుడు కేవలం స్వల్పకాలిక రాబడిపైనే దృష్టి పెట్టొద్దు.
- ఇటీవలి కాలంలో మంచి పనితీరు చూపిస్తే, దానినే ఆ ఫండ్లను ఎంచుకోవడానికి ప్రామాణికంగా చూడొద్దు.
- దశల వారీగా పెట్టుబడులు కొనసాగించండి. మార్కెట్ పడిపోతున్నప్పుడూ పెట్టుబడులు కొనసాగాలి. క్రమం తప్పకుండా పెట్టుబడులు పెట్టడంపైనే దృష్టి సారించండి.
- ప్రారంభంలోనే ఒకే రంగానికి పరిమితమయ్యే సెక్టోరియల్ ఫండ్లపై దృష్టి పెట్టొద్దు.
- మార్కెట్లో అస్థిరతకు సిద్ధంగా ఉండాలి. సూచీల్లో 10-20 శాతం క్షీణత సర్వసాధారణం. ఇప్పుడు మార్కెట్లోకి వస్తున్న మదుపరులు 30 శాతం తగ్గినా ఇబ్బంది లేదు అనే ధోరణితో ఉండాలి.

కొత్తగా సిప్ చేస్తుంటే

స్టాక్ మార్కెట్ సూచీలు గరిష్ఠ స్థాయుల్లో కొనసాగుతున్నాయి. ఇలాంటప్పుడు పెట్టుబడులు కొంచెం నష్టభయంతో కూడుకున్నవే. అయినప్పటికీ.. సిప్ ద్వారా మార్కెట్లో ఉన్న అవకాశాలను అందుకునేందుకు వీలుంది.

నిధిని సృష్టించండి: అత్యవసర పరిస్థితుల్లో దీర్ఘకాలిక పెట్టుబడుల నుంచి డబ్బును తీయకుండా ఉండాలి. ఇందు కోసం కనీసం ఆరు నెలల ఖర్చులకు సరిపోయే మొత్తం మీకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. ఇందుకోసం లిక్విడ్ ఫండ్లలో సిప్ చేయొచ్చు.

మధ్యస్థ కాలానికి: చాలామంది యువ పెట్టుబడిదారులకు కొన్ని మధ్యస్థ కాల లక్ష్యాలు ఉంటాయి. ఇలాంటి అవసరాల కోసం విడిగా మదుపు చేయాలి. ఉదాహరణకు కారు కొనాలని అనుకోవచ్చు. లేదా ఇంటి కోసం ముందస్తు చెల్లింపు కావచ్చు. ఇలాంటి వాటన్నింటికీ ప్రత్యేకంగా ఒక సిప్‌ను ప్రారంభించాలి. స్వల్పకాలిక డెట్ ఫండ్లను ఇందుకోసం ఎంపిక చేసుకోవచ్చు.

దీర్ఘకాలిక లక్ష్యంతో: మీరు సాధించాల్సిన లక్ష్యం 15-20 ఏళ్ల, అంతకు మించి ఉంటే.. దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టాలి. పిల్లల ఉన్నత చదువులు, మీ పదవీ విరమణ లాంటివి ఇందుకు ఉదాహరణ. ఇందుకోసం నష్టభయాన్ని భరించే సామర్థ్యం ఆధారంగా 80-90 శాతం వరకూ ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలో మదుపు ప్రారంభించాలి.

కొత్తగా మార్కెట్లోకి ప్రవేశించే వారు నిఫ్టీ లేదా సెన్సెక్స్ సూచీ ఆధారంగా పనిచేసే లార్జ్ క్యాప్ ఫండ్లను పరిశీలించాలి. ఈక్విటీ అంటేనే అస్థిరతకు మారు పేరు. వీటికి మానసికంగా అలవాటు కావాలి. ఇందుకోసం కనీసం రెండు మూడేళ్ల సమయం పడుతుంది. ఆ తర్వాతే నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ వంటి వాటికి కొంచెం ఎక్కువ మొత్తంలో పెట్టుబడిని కేటాయించాలి.

పెట్టుబడుల్లో కాస్త అనుభవం వచ్చాక దీర్ఘకాలిక పోర్ట్‌ఫోలియోను సిద్ధం చేసుకోవాలి. ఇందులో 70-80 శాతం వరకూ నిఫ్టీ ఇండెక్స్ ఫండ్, వాల్యూ ఫండ్, లో వోలటిలిటీ ఫండ్లవంటివి ఉండాలి. ఆ తర్వాతే.. అధిక రాబడి కోసం ప్రయత్నించాలి. స్మాల్, మిడ్ క్యాప్ ఫండ్లలో అస్థిరత అధికంగా ఉంటుంది. అదే సమయంలో లాభాలూ అధికంగా ఉంటాయి. అనుభవం వచ్చాకే వీటిపై దృష్టి పెట్టాలి.

వైవిధ్యంగానూ: కేవలం ఈక్విటీల్లోనే పెట్టుబడులు పెట్టడం మంచిది కాదు. డెట్, బంగారం, ఇతర పథకాలనూ పరిశీలించాలి. పెట్టుబడుల్లో కనీసం 20 శాతం వరకూ వీటికి కేటాయించాలి. అప్పుడే పోర్ట్‌ఫోలియో స్థిరంగా ఉంటుంది.

షేర్ల విలువ తగ్గినప్పుడు...

స్టాక్ మార్కెట్లో కొన్ని సందర్భాల్లో మంచి కంపెనీల షేర్లూ తక్కువ ధరకు లభిస్తుంటాయి. ఇలాంటి వాటిల్లో మదుపు చేసినప్పుడు దీర్ఘకాలంలో మంచి లాభాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది. ఇలాంటి వ్యూహంతోనే యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ నుంచి ఒక కొత్త పథకం అందుబాటులోకి వచ్చింది. యాక్సిస్ నిఫ్టీ 500 వాల్యూ 50 ఇండెక్స్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 18 వరకూ అందుబాటులో ఉండనుంది. కనీస పెట్టుబడి రూ.100. ఈ ఓపెన్ ఎండెడ్ పథకం ఇండెక్స్ ఫండ్స్ రకానికి చెందింది. నిఫ్టీ 500 వాల్యూ 50 టీఆర్ఐ సూచీ ప్రామాణికంగా పనిచేస్తుంది. నిఫ్టీ 500లో వాస్తవిక ధరకన్నా తక్కువ ధరకు లభిస్తున్న కంపెనీలను ఎంచుకొని, పోర్ట్‌ఫోలియోను నిర్మిస్తుంది. దీర్ఘకాలం పాటు మదుపు చేయాలనుకునే మదుపరులకు ఈ పథకం అనుకూలమని చెప్పొచ్చు.

వేచి చూసే వ్యవధి తక్కువగా

ఆరోగ్య బీమా పాలసీ తీసుకున్నప్పుడు ముందస్తు వ్యాధుల చికిత్సకు సాధారణంగా 36 నెలల పాటు వేచి ఉండే వ్యవధి ఉంటుంది. దీనికి భిన్నంగా పాలసీ తీసుకున్న 31 రోజు నుంచే ఇలాంటి వ్యాధుల చికిత్సకు పరిహారం అందించేలా మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ 'సర్వ' పేరుతో సరికొత్త పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీలో ప్రధానంగా మూడు ఆప్షన్లు ఉన్నాయి. సర్వ ప్రథమ్‌లో క్యాన్సర్, గుండె జబ్బులు ఇతరత్రా వ్యాధుల చికిత్సకు సంబంధించి రూ.3 కోట్ల వరకూ బీమాను తీసుకోవచ్చు. మధుమేహం, అధిక రక్తపోటు, ఆస్తమా, ఊబకాయం వంటి ముందస్తు వ్యాధుల చికిత్సకూ 31 రోజుల తర్వాత పరిహారం లభిస్తుంది. సర్వ ఉత్తమ్‌లోనూ సారథి అనే ఆప్షన్ కింద 31 రోజు నుంచి ముందస్తు వ్యాధుల చికిత్సకు పరిహారం అందుతుంది. ఇక సర్వ పరమ్‌లో ఎలాంటి వేచి ఉండే వ్యవధీ లేదు. ఇందులో 'గుల్లక్ అడ్వాంటేజ్' ఆప్షన్‌లో క్లెయిములతో సంబంధం లేకుండా ఏటా 100 శాతం వరకూ పాలసీ విలువ పెరుగుతుంది. ఇలా గరిష్ఠంగా 10 రెట్ల వరకూ పాలసీ విలువ అధికం అవుతుంది. వీటన్నింటిలోనూ ఆసుపత్రిలో చేరే 90 రోజుల ముందు, ఇంటికి వచ్చాక 180 రోజుల వరకూ అయ్యే ఖర్చులు చెల్లించేలా ఏర్పాటు ఉంది. రూ.3 కోట్ల వరకూ వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీని అందిస్తాయి. గడువు ముగియడానికి 30 రోజుల ముందే పాలసీని పునరుద్ధరిస్తే ప్రీమియంపై 2.5 శాతం వరకూ రాయితీ లభిస్తుంది. ఇద్దరు లేదా అంతకు మించి కుటుంబ సభ్యులకు కలిసి ఒకే పాలసీని తీసుకుంటే 10 శాతం వరకూ 'ఫ్యామిలీ డిస్కౌంట్' అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది.

కొత్త పథకం

జీవితాంతం పింఛను అందేలా

పదవీ విరమణ అనంతరం జీవితాంతం వరకూ పింఛను అందించే డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్‌ను రిలయన్స్ నిపాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని పేరు రిలయన్స్ నిపాన్ లైఫ్ నిశ్చిత్ పెన్షన్. ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం 2041 నాటికి దేశ జనాభాలో 15.9 శాతం మంది 60 ఏళ్లకు పైబడిన వారే ఉంటారు. ఈ నేపథ్యంలో పింఛను పథకాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా చిన్న కుటుంబాలు పెరుగుతున్నందున ఆర్థికంగా ఎవరి మీదా ఆధారపడాల్సిన అవసరం లేకుండా డిఫర్డ్ యాన్యుటీ పథకాలు తోడ్పడతాయని సంస్థ పేర్కొంది. ఈ పాలసీలో జీవితాంతం వరకూ పింఛను వచ్చేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఆ తర్వాత జీవిత భాగస్వామి, పిల్లలకు, తోబుట్టువులకూ పింఛను అందే ఏర్పాటు చేయొచ్చు. 5 నుంచి 10 ఏళ్ల వరకూ పాలసీకి ప్రీమియం చెల్లించే ఏర్పాటు ఉంది. ఏదైనా అనుకోని అనారోగ్యం, వైకల్యం సంభవించినప్పుడు డబ్బును వెనక్కి తీసుకునే వీలుంది.

పరిశుభ్ర ఇండియా మనందరి లక్ష్యం



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునిత బిల్లా తదితరులు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: పరిశుభ్రత.. పచ్చదన ఇండియా మనందరి లక్ష్యం కావాలని ఆదాయపు పన్ను శాఖ తిరుపతి ప్రిన్సిపల్ కమిషనర్ సునిత బిల్లా, జాయింట్ కమిషనర్ టీవీ వంశీధర్ అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా గురువారం ఆదాయ పన్ను శాఖ అధికారులు, సిబ్బంది వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. క్లీన్ ఇండియా.. గ్రీన్ ఇండియా నినాదాలు చేశారు. కార్యాలయంలోని పాత రికార్డులను తొలగించారు. బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేశారు.

సౌకర్యవంతంగా బీవోబీ సేవలు



ఆధునికీకరించిన ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న జీఎం రితేష్ కుమార్ తదితరులు

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: వినియోగదారులకు మరింత సౌకర్యవంతంగా బ్యాంకింగ్ సేవలు అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) జీఎం, జోనల్ హెడ్ రితేష్ కుమార్ అన్నారు. తిరుపతిలోని ప్రధాన శాఖలో ఆధునికీకరించిన ప్రాంగణాన్ని గురువారం ప్రారంభించారు. తిరుపతిలోనే దాదాపు లక్షమంది వినియోగదారులకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. బ్యాంక్ గ్లోబల్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్‌ను ఎంపిక చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. డీజీఎం ఎంవీఎస్ సుధాకర్, రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామమూర్తి, శాఖల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

55 వేలమందికి జియో ట్యాగింగ్



చిన్నారుల కుటుంబసభ్యులతో ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు రామకృష్ణ, సౌజన్య, సీఐ శ్రీనివాస్ తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో చిన్నపిల్లలు, వృద్ధులు, వికలాంగులు తప్పిపోకుండా పోలీసుల జియో ట్యాగింగ్ కొనసాగుతోంది. గురువారం వరకు 55 వేల మంది మంది పిల్లలకు ట్యాగింగ్ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక పోలీస్ కంట్రోల్ కేంద్రం ఇన్‌ఛార్జి, అదనపు ఎస్పీ సౌజన్య ఆధ్వర్యంలోని బృందం సభ్యులు తప్పిపోయిన కర్నూలు జిల్లా రామదుర్గానికి చెందిన అశ్విత(10)ను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. అదనపు ఎస్పీతోపాటు సభ్యులు సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు స్వప్న, కృష్ణపావనిలను ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ట్రెక్కింగ్ విజయవంతం



ఆలయం ఎదుట కేడెట్ల బృందం

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్‌కు చెందిన 35(ఆంధ్ర) బెటాలియన్ గురువారం తిరుమల ట్రెక్కింగ్ యాత్ర చేపట్టింది. బెటాలియన్‌కు చెందిన 506 మంది ఎన్‌సీసీ కేడెట్లు, 15 మంది శాశ్వత శిక్షకులు, 13 మంది అసోసియేటెడ్ ఎన్‌సీసీ అధికారులతో కూడిన బృందం శ్రీవారి మెట్టు మార్గంలో ఏపీ ట్రెక్-1 అనే ట్రెక్కింగ్ యాత్రను నిర్వహించింది. శ్రీవారిని దర్శించుకుని యాత్ర పూర్తి చేశారు.

రథోత్సవానికి సర్వం సిద్ధం





తిరుమల శ్రీవారి ఆలయానికి పుష్పాలంకరణ ● విహారానికి ముస్తాబైన తేరు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం జరగనున్న రథోత్సవానికి తేరు సిద్ధమైంది. ఆలయానికి పుష్పాలంకరణ మార్పు చేశారు. గురువారం వాహన సేవలకు సాంస్కృతిక వైవిధ్యం కనిపించేలా వివిధ రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. తితిదే హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 16 బృందాలు, 405 మంది కళాకారులు పాల్గొని తమ నైపుణ్యం ప్రదర్శించారు.

■ తిరుమలలోని నాదనీరాజనం, ఆస్థాన మండపంలో తితిదే హిందూ ధార్మికప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన ధార్మిక, సంగీత కార్యక్రమాలు అలరించాయి.

శ్రీవారి పుష్కరిణిలో రోజంతా పవిత్రత

శ్రీవారి చక్రస్నానం పవిత్రత రోజంతా ఉంటుందని, భక్తులు సంయమనం పాటించి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించాలని తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి కోరారు. గురువారం స్థానిక అన్నమయ్య భవనంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరి అంకమైన ఈ నెల 12న చక్రస్నాన ఏర్పాట్లపై అదనపు ఈవో, అధికారులతో సమీక్షించారు.

■ **తిరుపతి (గ్రామీణ):** తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం మలయప్పస్వామి సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

14న ఎన్నికల నోటిఫికేషన్

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తితిదే ఉద్యోగుల సహకార బ్యాంకు ఎన్నికల షెడ్యూల్ ఖరారైంది. ఏడుగురు పాలక మండలి డైరెక్టర్లుగా ఉండే బ్యాంకుకు ఈ నెల 14వ తేదీన నోటిఫికేషన్‌ను వెలువరించేందుకు జిల్లా సహకార శాఖ విభాగం అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. 28న ఎన్నికలను నిర్వహించేందుకు తేదీ నిర్ణయించినట్లు సమాచారం.

మానసిక ఒత్తిడి అధిగమించాలి

తిరుపతి(వైద్యవిభాగం): మానసిక ఒత్తిడి అధిగమిస్తేనే ఆరోగ్యం సాధ్యమని శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఉషా కళావత్, మానసిక వైద్య విభాగాధిపతి గణేష్‌కుమార్, ప్రొఫెసర్ వనజాక్షమ్మ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్విమ్స్ నుంచి వాల్మీకి కూడలి వరకు వాక్‌థాన్ నిర్వహించారు. శ్రీ పద్మావతి ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.

శాశ్వత ఉద్యోగులుగా ఇద్దరు ఏఈలు

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తితిదేలో 30 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎస్.శ్రీబాలాజీ, కేఎన్ వెంకటేష్‌లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

రతన్ టాటాకు ఘన నివాళి



రతన్ టాటా చిత్రపటానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి (వైద్యవిభాగం, బైరాగిపట్టెడ): పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా గొప్ప మానవతావాదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అన్నారు. గురువారం టాటా క్యాన్సర్ ఆసుపత్రిలో టాటా చిత్రపటానికి నివాళి అర్పించారు. దంపూరి భాస్కర్ యాదవ్, డాక్టర్ ప్రశాంత్, మహేష్ యాదవ్, బండ్ల లక్ష్మీపతి రాయల్, రమణరాజు పాల్గొన్నారు. **తిరుపతి (గ్రామీణ):** పెరుమాళ్లపల్లి పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ ఆధ్వర్యంలో టాటా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

తిరుపతి (బైరాగిపట్టెడ): రతన్ టాటా అస్తమించడం దేశానికి తీరని లోటని రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ డా.రమేష్‌నాథ్ లింగుట్ల ప్రెస్‌క్లబ్‌లో అన్నారు.

'కూటమి అభివృద్ధి జగన్ రాసుకోవాలి'

తిరుపతి(భవానీనగర్): మాజీ సీఎం జగన్ ఎన్డీఏ కూటమిపై గుడ్‌బుక్ రాస్తానని ప్రకటించారని, ఆయన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో జరిగే అభివృద్ధిని రాసుకోవాలని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి సూచించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు.

ట్రావెల్స్ బస్సులో బ్యాగ్ మాయం

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణికుడి సంచి కనబడకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. తిరుపతికి చెందిన కార్తీక్ నాయక్ బెంగళూరు నుంచి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో తిరుపతికి వచ్చారు. బస్సు ఎక్కే సమయంలో లగేజీ బస్సు అండర్ కారిడార్‌లో సిబ్బంది పెట్టారు. తిరుపతికి వచ్చాక తీసుకునే క్రమంలో సంచి కనబడలేదు. అందులో కొంత బంగారం ఉన్నట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ విషయంగా విచారిస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

చంద్రగిరి, న్యూస్‌టుడే: పూతలపట్టు-నాయుడుపేట మార్గం నాగాలమ్మ మలుపు వద్ద రోడ్డు పక్కన ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరోలారీ గురువారం ఢీకొంది. ఈ ఘటనలో లారీ ముందు భాగం నుజ్జు కాగా డ్రైవరు సుబ్రహ్మణ్యం క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రగాయాలకు గురయ్యాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

శెట్టిపల్లె భూముల బాధ్యత తుడాకు



శెట్టిపల్లె భూముల్లో పర్యటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం భన్సల్, కమిషనర్ మౌర్య

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: శెట్టిపల్లె భూముల అభివృద్ధి, లేఔట్ రూపకల్పన బాధ్యతలను నగరపాలక నుంచి తుడాకు అప్పజెపుతున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి అర్బన్ మండలం మంగళం పరిధిలోని శెట్టిపల్లె భూములను గురువారం జేసీ శుభం భన్సల్, కమిషనర్ మౌర్య, రెవెన్యూ, తుడా అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. భూములను రెండు రోజుల్లో సర్వే చేసి, సరిహద్దులు గుర్తించి, తుడాకు రికార్డులను అప్పగించనున్నట్లు చెప్పారు. ఇళ్ల స్థలాల కొనుగోలుదారులకు ప్రభుత్వ జీవో ప్రకారం 2 సెంట్లకు తగ్గకుండా ప్లాట్లు కేటాయిస్తామని, 50 అంకణాలకు మించి స్థలం ఉన్నవారికి 50 శాతం కేటాయిస్తామన్నారు.

యువతి ప్రాణాలు కాపాడిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించిన యువతి సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే ప్రాణాలతో కాపాడారు. రాయచోటికి చెందిన ఓ యువతి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతోంది. ఆత్మహత్య చేసుకుంటానంటూ.. మత్తు మాత్రలు వేసుకునే వీడియోను కుటుంబ సభ్యులకు పంపింది. కుటుంబ సభ్యులు ఆ వీడియోను డీజీపీ కంట్రోల్‌రూమ్‌కు పంపి బిడ్డను కాపాడాలని కోరారు. అక్కడి నుంచి సమాచారం రావడంతో అలిపిరి సీఐ రామ్‌కిషోర్ సిబ్బందితో కలసి దర్యాప్తు చేశారు. యువతి సెల్‌ఫోన్ స్విచాఫ్ ఉండగా.. అప్పటి వరకు మాట్లాడిన ఫోన్ నంబర్లను గుర్తించి ఆరా తీశారు. వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురైన ఆ యువతి. . స్నేహితుడి గదికి వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడింది.

వ్యసనాలకు దూరంగా ఉండండి

తిరుపతి(వైద్యవిభాగం): మానసిక రోగులు వ్యసనాలకు మరింత దూరంగా ఉండాలని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ పేర్కొన్నారు. రుయాలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. రుయా సూపరింటెండెంట్ రవిప్రభు వైద్యులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి(ఆర్టీసీ): తిరుమల-తిరుపతి ఘాట్ రోడ్డు విద్యుత్తు బస్సు డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసుబ్రహ్మణ్యం, కందారపు మురళి, నాయకులు డిమాండ్ చేశారు. అలిపిరి డిపో వద్ద గురువారం డ్రైవర్లకు మద్దతుగా నిరసన వ్యక్తం చేశారు. జిల్లా డిప్యూటీ సీటీఎం భాస్కర్ వచ్చి.. వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

న్యూస్‌టుడే, తిరుపతి(నగరపాలిక)

సమస్య : రాములవారి గుడి ఉత్తర మాఢవీధిలో ఎప్పుడు చూసినా చెత్తదిబ్బలు కనిపిస్తున్నాయి. స్థానికులు కాలువ సమీపంలో వేసి వెళ్తున్నారు.

– శివయ్య, భక్తుడు

సమాధానం: మాఢ వీధిలో చెత్తవేసే వారిని గుర్తించి చర్యలు చేపడతాం.

– డా.యువఅన్వేష్, వైద్యాధికారి, నగరపాలిక

న్యూస్‌టుడే, యర్రావారిపాలెం

సమస్య: కమలయ్యగారిపల్లి పంచాయతీలో మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం నిండి దుర్గంధం వెదజల్లుతోంది. దోమల ఉద్ధృతి ఎక్కువగా ఉంది.

– శ్రీనివాసులు, స్థానికుడు

సమాధానం: కార్మికులతో శుభ్రం చేయించి దోమల నివారణకు చర్యలు చేపడతాం.

– సతీష్, పంచాయతీ కార్యదర్శి